ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5



శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 4 సెప్టెంబరు 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
హిందూపురం, మడకశిర, పెనుకొండ :9985445760
ధర్మవరం, పుట్టపర్తి : 9963160529
కదిరి :9052518170
ఏసీఎమ్: 9985411154

అంచనాలకు మించి మంచి

అందుకే 'సూపర్ సిక్స్.. సూపర్ హిట్' సభ
ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు
బహిరంగ సభ ఏర్పాట్లకు భూమిపూజ



అనంతపురం నగర శివారులో 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభా వేదిక భూమిపూజలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే అంచనాలకు మించి ప్రజలకు మంచి చేసిందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. అందుకే ఈ నెల 10వ తేదీ అనంతపురంలో సూపర్ సిక్స్- సూపర్‌హిట్ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణశ్రీ తదితరులతో కలిసి నగర శివారులోని జీఎంఆర్ ఇంద్రప్రస్థ వద్ద సభ ఏర్పాటుకు బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ మీడియాతో మాట్లాడారు. అధికారం చేపట్టిన 15 నెలల్లో ఆరు హామీల్లో ఐదింటిని అమలు చేశామని, మరో హామీ అమలుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. జగన్ అరాచక పాలనలో రూ.10 లక్షల కోట్ల అప్పులు మిగిల్చారని, జీతాలు, పెన్షన్లు ఇవ్వలేని దుస్థితికి ఏపీ ఆర్థిక స్థితిని దిగజార్చారని విమర్శించారు. సీఎంగా చంద్రబాబు పదవి చేపట్టిన తర్వాత హామీలను త్వరగా అమలు చేశామని అన్నారు. ఈ నెల 10వ తేదీ జరిగే సూపర్ సిక్స్- సూపర్ హిట్ సభను దిగ్విజయం చేయాలని ప్రజలను కోరారు.

విజయవంతం చేయాలి..

● కూటమి ప్రభుత్వంలో 15 నెలల కాలంలో 90 శాతం హామీలను అమలు చేసిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. ఈ నెల 10న జరిగే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ పెద్దలు వస్తారని, 3.50 లక్షల మంది ప్రజలు పాల్గొంటారని తెలిపారు. అనంతపురం అర్బన్ చరిత్రలో ఇంత భారీ సభ ఎప్పుడూ జరగలేదని, ప్రజలు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరై విజయంతం చేయాలని కోరారు.

● ప్రధాని మోదీ సంపూర్ణ మద్దతు, సీఎం చంద్రబాబు దూర దృష్టి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సంపూర్ణ సహకారంతో ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. అనంతపురం జిల్లాపై సీఎం ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, రూ.3500 కోట్లతో హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు చేయించారని అన్నారు.

● ఎన్నికల హామీలను అమలు చేసిన కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వమని ప్రజలు కితాబిచ్చారని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని అన్నారు. 2024 ఎన్నికల్లో ఇచ్చి ప్రతి హామీని నేరవేర్చి, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. విజయోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు.

● కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, హామీల అమలు చారిత్రాత్మకమని ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ (మిగతా 6లో..)

నలుగురికి పదవులు



సాకే యశోద



భక్తర్ షేక్



కృష్ణమూర్తి

పుట్టపర్తి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన నలుగురికి కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ పదవులు దక్కాయి. బుధవారం రాష్ట్రంలో 11 కార్పొరేషన్లకు డైరెక్టర్లను ప్రభుత్వం నియమించింది. ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ అభివృద్ధి ఏజెన్సీ డైరెక్టర్లుగా పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన సాకే యశోద, పెనుకొండ నియోజకవర్గం నుంచి వెంకటేశ్వర్లును నియమించారు. రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మడకశిరకు చెందిన భక్తర్ షేక్, రాష్ట్ర వ్యవసాయశాఖ మిషన్ డైరెక్టర్‌గా కదిరికి చెందిన కృష్ణమూర్తి మస్తాటిని నియమించారు. ఈ నలుగురు టీడీపీకి చెందినవారే. దీంతో శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిస్వార్థ సేవలకు ప్రతిరూపం
శ్రీసత్యసాయి వైద్యసేవలపై కేరళ ఎంపీ
7

అంపశయ్యపై వసతి గృహం..!

నంబులపూలకుంట బీసీ హాస్టల్‌లో దారుణం

● ఒక్కసారిగా పడిపోయిన విద్యార్థుల సంఖ్య
● పట్టించుకోని ఇన్‌చార్జి వార్డెన్
● కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



బీసీ బాలుర వసతి గృహం

నంబులపూలకుంట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహానికి నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. ఇన్‌చార్జి వార్డెన్ పట్టించుకోకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో హాస్టల్ మూత దిశగా పయనిస్తోంది. గతేడాది 130 మంది విద్యార్థులు వసతి పొందిన హాస్టల్‌లో ఈసారి 15 మందే ఉండడమే ఇందుకు నిదర్శనం. విద్యార్థుల సంఖ్య పెంచే దిశగా కనీస చర్యలు కరువయ్యాయి. మండల కేంద్రానికి చెందిన విద్యార్థులకు అవకాశం కల్పించకపోవడం కూడా కొంతవరకు ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది.

పడిపోతున్న విద్యార్థుల సంఖ్య

నంబులపూలకుంటలోని కదిరి-రాయచోటి ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వ కార్యాలయాల వద్ద బీసీ బాలుర వసతి గృహం ఉంది. మండలానికి చెందిన 4 నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు ఇందులో వసతి అవకాశం కల్పిస్తారు. ఇందులో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఈ ఏడాది దారుణంగా పడిపోయింది. 15 మంది విద్యార్థులు మాత్రమే ఉంటున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో 40మంది విద్యార్థులు ఉండేవారు. 25 మంది వెళ్లిపోవడంతో 15 మంది మాత్రమే ఉంటున్నారు. రోజురోజుకీ విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. గతంలో ఇక్కడ పనిచేసిన వార్డెన్లు రోజూ విద్యార్థులు వెళ్లే పాఠశాలలకు వెళ్లి వారి హాజరును తనిఖీ చేసి, వసతిగృహాలపై అవగాహన కల్పించేవారు. వసతిగృహాల్లో చేర్చుకోవడానికి ప్రయత్నించేవారు. మరికొంతమంది వార్డెన్లు అయితే మండలంలో పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులను గుర్తించి, వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు నచ్చజెప్పి, వసతి గృహంలో చేర్పించుకునేవారు. ప్రస్తుతం హాస్టల్‌కు వార్డెన్ లేరు. మండలంలోని తిమ్మమ్మ మర్రిమాను వద్ద గల హాస్టల్ వార్డెన్‌కు నంబులపూలకుంట వసతిగృహం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మండలకేంద్రంలోని వసతి గృహంలో విద్యార్థులు లేరన్న సాకు చూపితే, ఉన్న వారిని తిమ్మమ్మ మర్రిమానుకు తీసుకెళ్లే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. వసతిగృహానికి ప్రహరీ లేకపోవడంతో మూగజీవాలు లోపలికి వస్తున్నాయి. బయటి వ్యక్తులు వసతి గృహ ఆవరణలోని చెట్ల కింద ఇష్టారాజ్యంగా కూర్చుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ముగ్గురు వంటవారే. వీరిలో ఒకరిద్దరే హాజరవుతారు. విద్యార్థుల శాతం తక్కువగా ఉండడంతో ఒకరు మాత్రమే వస్తున్నట్లు తెలుస్తోంది. బిల్లులు మాత్రం ఒకరు వంట మనిషి, మరొకరు స్వీపర్, ఇంకొకరు వాచ్‌మన్‌గా పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. స్వీపర్ ఒక గదిని మాత్రమే శుభ్రంచేసి, అందులోనే విద్యార్థులు ఉండేలా చూస్తున్నట్లు సమాచారం. విద్యార్థులు తాగడానికి బోరునీటిని ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది.

పేదలకు అవకాశం కల్పించాలి: బాలిరెడ్డి, కొత్తపల్లి



బాలుర వసతిగృహంలో ప్రతి పేద విద్యార్థికి అవకాశం కల్పించాలి. మండల వాసి అయితే చాలు.. వసతిగృహంలో చేర్చుకోవాలి. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి. అధికారులు పర్యవేక్షించి, విద్యార్థుల సంఖ్యను పెంచాలి.



విరిగిపోయిన కొళాయిలు
నిరుపయోగంగా ఉన్న బాత్‌రూమ్‌లు
మూతపడిన పాత కామన్ మరుగుదొడ్లు

విద్యార్థుల సంఖ్య పెంచాలి



వసతి గృహంలో పేద విద్యార్థులే ఉంటారు. పిల్లలు రాకపోతే ఆరాతీయాలి. వచ్చేలా చేయాలి. అందుకు విరుద్ధంగా ఉన్నవారి సంఖ్య తగ్గించడం ఏమిటి? మండలకేంద్రలోని విద్యార్థులకు అవకాశం కల్పించకపోవడం సరికాదు. గతంలో 50 మందికిపైగా మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు ఉండేవారు. వసతిగృహంలో అందరూ వంట వారు ఉండడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. స్వీపర్ పనిచేస్తే వసతిగృహం శుభ్రంగా ఉంటుంది. -గంగిరెడ్డి, రైతు సంఘం నాయకుడు

మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం

బాలుర వసతి గృహంలో విద్యార్థులకుమెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం. మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాం. ప్రహరీ నిర్మాణానికి నివేదికలు పంపాం.

-పెద్దన్న,
ఇన్‌చార్జి వార్డెన్,
బాలుర వసతిగృహం

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా

● గొల్లపల్లి రిజర్వాయర్‌పై మంత్రి సవిత



పర్యాటక శాఖాధికారులతో మాట్లాడుతున్న మంత్రి

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది, పెనుకొండకే బ్రాండ్‌గా మార్చుతానని మంత్రి సవిత పేర్కొన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో బుధవారం పర్యాటక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. రిజర్వాయర్‌లో బోటింగ్, రెస్టారెంట్, గెస్ట్ హౌస్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పెనుకొండ కొండకువెళ్లే దారిలో టూరిజం రెస్టారెంట్ ఏర్పాటు, కృష్ణదేవరాయల ఉత్సవాలపై చర్చించారు. అనంతరం పలుశాఖల్లో పురోగతిపై చర్చించారు.

నేడు స్టేట్ కమిషన్ చైర్మన్ రాక

పుట్టపర్తి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్టేట్ కమిషన్ చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ పుట్టపర్తికి గురువారం వస్తున్నారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకుంటారు. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని 3గంటలకు విజిట్ చేస్తారు. సత్యసాయి ఉన్నత విద్యా సంస్థలను, చైతన్య జ్యోతి మ్యూజియంను సాయంత్రం 4 గంటలకు సందర్శిస్తారు. సాయికుల్వంతులో సాయంత్రం 4.30 గంటలకు జరిగే కేరళ ఓనం వేడుకల్లో పాల్గొంటారు. రాత్రి 7.30 గంటలకు తిరిగి బెంగళూరుకు వెళతారు. ఆయన పర్యటనకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

మోతాదు మించితే ముప్పే



● విచ్చలవిడిగా ఎరువులు, పురుగు మందుల వినియోగం
● చుట్టుముడుతున్న తెగుళ్లు
● పెరిగిపోతున్న వ్యవసాయ ఖర్చులు
● ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
● సేంద్రియ ఎరువులపై అవగాహన అవసరం

6

నిమజ్జనోత్సవానికి సిద్ధం

గుడ్డం కోనేరు వద్ద ఏర్పాట్లు

మునుపెన్నడూ లేనంత భద్రత
పురానికి సీమ జిల్లాల పోలీసులు

హిందూపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నవరాత్రులు పూజలందుకున్న ఏకదంతుడు గురువారం గంగమ్మ ఒడికి చేరనున్నాడు. నిమజ్జనోత్సవానికి మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, ఆర్ అండ్ బీ, పోలీసు శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈసారి భారీ విగ్రహాలే 30 నుంచి 40 దాకా ఉన్నాయి. మొత్తంగా 150కి పైగా విగ్రహాలు ఉన్నాయి. పెద్ద విగ్రహాలను వాహనంలోకి చేరిస్తే 30 అడుగులకుపైగా ఎత్తు వస్తాయి. వీటిని తరలించే సమయంలో ఇబ్బంది తలెత్తకుండా రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలను కత్తిరించారు. వినాయక ప్రతిమలను గుడ్డం కోనేరులో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. తెలుగు చేనేత శిక్షణా కేంద్రం నుంచి గుడ్డం రంగనాథస్వామి ఆలయం వరకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. వెలుతురు ఉండేలా భారీ లైట్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరా అంతరాయం కలిగినా, ఇబ్బంది లేకుండా జనరేటర్‌ను అందుబాటులో ఉంచారు. నిమజ్జనం కోసం భారీ క్రేన్‌లు అందుబాటులో ఉంచారు. కోనేరు వద్ద గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది ఉంటారు. పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపు, నోపార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా 1300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐ, సిబ్బంది ఇప్పటికే పురం చేరుకున్నారు. అనంతపురం, చిత్తూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి పోలీస్ సిబ్బందిని రప్పించారు. పట్టణంలో బుధవారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు.



నీటితో నింపిన గుడ్డం కోనేరు



భద్రతను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐలు

డ్రోన్ కెమెరాల నిఘా

గతంలో నిమజ్జనం రోజున జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాలైన హస్నాబాద్, ఆర్టీసీ కాలనీ, ముక్కడిపేట, సీపీఐ కాలనీ, రహమత్‌పురం, నింకంపల్లి తదితర ప్రాంతాల్లో విగ్రహాల వద్ద పోలీసులు డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాలు చిత్రీకరించే దృశ్యాలను లైవ్ ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పోలీసు అధికారులు పరిశీలించి, పర్యవేక్షించనున్నారు. ఎక్కడైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే స్పందించేందుకు సిద్ధమయ్యారు. మిలాద్ ఉన్ నబి పండగ శుక్రవారం ఉన్నందున, ఆ రోజు ఉదయానికి నిమజ్జనం పూర్తి అయ్యేలా చూడాలని పోలీసులు శ్రమిస్తున్నారు. ప్రతి విగ్రహానికి ఇద్దరు కానిస్టేబుళ్లు, ప్రతి రెండు విగ్రహాలకు ఓ హెడ్‌కానిస్టేబుల్, మూడు విగ్రహాలకు ఓ ఏఎస్ఐ, నాలుగు విగ్రహాలకు ఒక ఎస్ఐ, ఐదు విగ్రహాలకు ఓ సీఐ ప్రకారం బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుకున్న సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలని, విగ్రహ కమిటీల నిర్వాహకులు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.


పంచరత్నాలు
ఉమ్మడి జిల్లాలో ఐదుగురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు (7లో)

కొత్త విధానం.. కొత్త కష్టం..!

● రిజిస్ట్రేషన్లకు ఓటీపీ తప్పనిసరి
● క్రయ, విక్రయదారులు చెబితేనే రిజిస్ట్రేషన్
● ముందస్తు ఫీజు చెల్లింపుతో అక్రమాలకు అవకాశం

మారతాయో.. లేదో..?

ఆటో మ్యుటేషన్ విధానం అమలులోకి రావడంతో డోర్, ఆస్తి అసెస్మెంట్ నంబర్లతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆటో మ్యుటేషన్ రిజిస్ట్రేషన్ కోసం పబ్లిక్ డేటాలో డోర్ నంబరు వేస్తే.. అసెస్మెంట్ నంబరు కనిపించడం లేదు. అసెస్మెంట్ నంబరు ఫీడ్ చేస్తే డోర్ నంబరు కనిపించడంలేదు. ఇలా రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజులకు సంబంధించి ఇంటి పన్నులు మారుతాయో.. లేదో అనే భయాందోళనల్లో రిజిస్ట్రేషన్ దారులు ఉన్నారు.



ధర్మవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): భూములు, స్థలాల క్రయవిక్రయాలకు సంబంధించి దస్తావేజుల రిజిస్ట్రేషన్ సమయంలో ప్రభుత్వం తీసుకొచ్చిన ఓటీపీ విధానంతో ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ విధానం అమలు అస్తవ్యస్తంగా ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ చేసేటపుడు క్రయ, విక్రయదారులకు సంబంధించిన ఫోన్లకు ఓటీపీ వెళ్తుంది. ఆ నంబర్లు చెబితేనే రిజిస్ట్రేషన్ అవుతుంది. ఏ ఒక్కరు చెప్పకపోయినా.. జాప్యమైనా.. అంతే సంగతులు. దీంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జాప్యమవుతోంది. ఏదైనా ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలి. అందులో ఇచ్చిన సమయానికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలి. దీంతో జాప్యం లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. ఈ పద్ధతి మంచి ఫలితాలను ఇవ్వటంతో మరో విధానాన్ని రిజిస్ట్రేషన్ల శాఖ ప్రవేశ పెట్టింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే అందుకు సంబంధించిన దస్తావేజు కొనుగోలు చేసిన వ్యక్తి మొబైల్‌కు వాట్సాప్ ద్వారా వస్తుంది.

ముందస్తు చెల్లింపులతో ఇక్కట్లు

ఆస్తి లావాదేవీలకు విలువను బట్టి స్టాంపు డ్యూటీ, యూజర్ చార్జీ ముందుగానే ఆన్‌లైన్‌లో చలానా రూపంలో చెల్లించి, పబ్లిక్ డేటాలో నమోదు చేసే విధానంలో అవినీతికి ఆస్కారం ఏర్పడిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఆస్తి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి దస్తావేజులు పూర్తి చేసి, పబ్లిక్ డేటా నమోదు చేసి, చెక్‌స్లిప్ వేసిన తరువాత సబ్‌రిజిస్ట్రార్ పరిశీలిస్తారు. అనంతరం స్టాంపు డ్యూటీ, యూజర్ చార్జీలు చెల్లించేవారు. అప్పుడు రిజిస్ట్రేషన్ జరిగేది. కొత్త విధానంలో ఆస్తి విలువలను బట్టి మొదట్లోనే రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించి, పబ్లిక్ డేటాలో నమోదు చేయాల్సి వస్తోంది. ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించాల్సి వస్తుండడాన్ని కొంతమంది సబ్‌రిజిస్ట్రార్లు సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. ఒక్కోసారి చలానాలు ఆన్‌లైన్‌లో కనిపించవనీ, దీనిని ఆసరాగా చేసుకుని, సబ్ రిజిస్ట్రార్లు క్రయవిక్రేతల నుంచి భారీగా గుంజుతున్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ సమయంలో వేలకు వేల రూపాయలు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలి



ఓటీపీ విధానంతో రిజిస్ట్రేషన్లు చేయించుకునేవారు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలి. అందరి ఓటీపీలు చెప్పాల్సి వస్తుండడంతో రిజిస్ట్రేషన్ జాప్యమవుతోంది. ఒక రిజిస్ట్రేషన్‌కు రెండు నుంచి మూడు రోజులు పడుతోంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

-అల్లం రామాంజనేయులు, డాక్యుమెంట్ రైటర్, ధర్మవరం

ఎంటెక్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ఆగస్టులో నిర్వహించిన ఎంటెక్ ఒకటి, రెండో సెమిస్టర్ ఫలితాలను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి విడుదల చేశారు. ఫలితాలు కళాశాల అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య వసుంధర, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య మాధవి, డాక్టర్ లలితకుమారి, జరీనా, హెచ్‌ఓడీ ఆచార్య భువన విజయ, ఆచార్య కేఎఫ్ భారతి, ఆచార్య నారాయణరెడ్డి, కల్యాణ్‌కుమార్, చంద్రమోహన్ రెడ్డి, కల్యాణిరాధ, అజిత పాల్గొన్నారు.

1922.75 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1922.75 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రయన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైల్వే వ్యాగిన్ ద్వారా వచ్చిన ఎరువుల ర్యాక్‌ను బుధవారం ఏడీఏ పరిశీలించారు. ఇందులో యూరియా 904.5 మెట్రిక్ టన్నులు, డీఏపీ 507.85, 20-20-0-13 రకం 255.2., 10-26-26 రకం 255.2 మెట్రిక్ టన్నులు సఫరా అయ్యాయన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు వీటిని ఏపీ మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్లకు కేటాయించామన్నారు.

2,112 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,112 క్యూసెక్కులు, 2072 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు బుధవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.697 టీఎంసీల నీటి నిల్వ ఉందని, ఫేజ్-2కు 1898 క్యూసెక్కుల నీరు వెళ్తోందని చెప్పారు.

మోతాదు మించితే ముప్పే..

- చుట్టుముడుతున్న తెగుళ్లు
- పెరిగిపోతున్న వ్యవసాయ ఖర్చులు
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- సేంద్రియ ఎరువులపై అవగాహన అవసరం

విచ్చలవిడిగా ఎరువులు, పురుగు మందుల వినియోగం



వరి పంటలో వేసేందుకు ఎరువులను కలుపుతున్న రైతులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'ఎంత ఎక్కువగా ఎరువులు వేస్తే.. పంట దిగుబడులు అంత బాగుంటాయి. పురుగు మందులు ఎంత ఎక్కువ పిచికారీ చేస్తే పంటలకు పురుగుల బెడద అంతగా తగ్గుతుంది.' ఎరువులు, పురుగుల మందుల వాడకంపై రైతుల నుంచి సాధారణంగా వినిపించే అభిప్రాయాలు. ఈ క్రమంలో అన్నదాతలు ఇష్టానుసారంగా ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తున్నారు. మోతాదుకు మించి ఎరువుల వాడడం వల్ల ప్రయోజనం ఉండకపోగా.. మట్టి చౌడుగా మారే ప్రమాదం ఉందన్న విషయంపై వ్యవసాయ శాఖ అధికారులు.. రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. దీంతో వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి.

అవసరం లేకపోయినా...

ఎరువుల వినియోగం ఏటా పెరిగిపోతోంది. దీనికి వ్యవసాయ శాఖ వద్ద ఉన్న లెక్కలే నిదర్శనం. ఎకరా పొలంలో 70 కేజీల యూరియాగానీ, 50 కేజీల డీఏపీగానీ, 27 కేజీల పొటాష్‌గానీ సరిపోతాయని వ్యవసాయ శాఖ అధికారులు.. రైతులకు సూచిస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులను దుక్కిలో మాత్రమే వాడాలి. క్షేత్రస్థాయిలో అంతకుమించిన మోతాదులో ఎరువులు వినియోగిస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులు పంటల సాగులోనూ వినియోగిస్తున్నారు. రైతులకు సందేహాలు వస్తే నేరుగా వ్యాపారులను ఆశ్రయించడం కూడా అధిక ఎరువుల వినియోగానికి కారణంగా కనిపిస్తోంది. పైరుకు చీడపీడలు సోకకుండా ముందస్తుగా ఈ మందు స్ప్రే చేయండంటూ వ్యాపారులు సలహాలు ఇస్తుంటారు. దీంతో అవసరం లేకపోయినా పైరు పాడవుతుందన్న ఆందోళనతో రైతులు కొనుగోలు చేసి, వాడేస్తున్నారు. రైతుల వద్ద పెట్టుబడులకు డబ్బు లేకపోవడం, అవసరమైన సమయంలో ఎరువులు, పురుగు మందులు వ్యాపారులు అప్పుగా ఇస్తుండడంతో వారి సలహాలను తీసుకునే పరిస్థితి నెలకొందని పలువురు అధికారులు, రైతులు చెబుతున్నారు.

భారీగా వ్యవసాయ ఖర్చులు

పంటల సాగులో రైతులు అవలంబిస్తున్న పద్ధతుల్లో కొన్ని మార్పులు వచ్చాయే తప్ప.. అధిక శాతం మంది ఒకే విధానంలో సాగు చేస్తున్నారు. ఎరువుల వినియోగంపై ఐదేళ్లుగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చేస్తున్న సిఫారసుల్లో పెద్దగా మార్పులేవీ లేవు. గతంలో ఎకరాలో వరి సాగుకు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అయ్యేది. ఇందులో సగం ఎరువులు, వాటిని పిచికారీ చేసే కూలీల ఖర్చే ఉంటోంది. ఇప్పుడు రూ.25వేల నుంచి 30వేల వరకు ఖర్చువుతోంది. ఇందులోనూ ఎరువులకే ఎక్కువ వెచ్చిస్తున్నారు. బస్తాలకు బస్తాలు ఎరువులు వేస్తున్నారు. మోతాదుకు మించి వినియోగించడం వల్ల తెగుళ్ల నాశనమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పైగా కొత్త కొత్త తెగుళ్ల పుట్టుకొస్తున్నాయి. దీంతో ఏటా అంతకు మించి ఎక్కువ శక్తి కలిగిన ఖరీదైన పురుగు మందులు వాడాల్సి వస్తోంది. దీంతో అన్నదాతకు పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే సేంద్రియ ఎరువులు వాడడం ఒక్కటే పరిష్కారం అని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. దీనిపై రైతులు అవగాహన పెంచుకుని, పాటించాల్సిన అవసరం ఉంది.

సేంద్రియ ఎరువులు వాడాలి



చాలా మంది రైతులకు సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన లేదు. రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడి నష్టపోతున్నారు. గొర్రెలు, పశువుల ఎరువులు వాడితే దిగుబడి పెరగడమే కాక నేలకు సైతం మంచి చేసిన వారం అవుతాం. ఏటా కచ్చితంగా పంట మార్పిడి చేయాలి. పచ్చి రొట్ట మొక్కలు పెంచి భూమిలో కలియదున్నాలి. ఇలాంటి విధానాలను పాటిస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి.

- రాము, రైతు, ఉప్పరహాళ్ క్రాస్

దిగుబడి కోసమే రసాయన ఎరువులు



పంట దిగుబడిని పెంచడానికి రసాయన ఎరువులు, మందులను ఉపయోగిస్తున్నాం. సేద్యం మొదలుకుని, నాట్లు వేసే కూలీలు వరకు ఖర్చులు పెరిగిపోయాయి. గిట్టుబాటు కావాలంటే దిగుబడి పెరగాలి. ధాన్యం ధర అతంత మాత్రం ఉన్నా.. ఎకరాకు 50 బస్తాలు వస్తే ఇప్పుడున్న ఖర్చులకు కాస్త సరిపోతుంది. ఎరువులు వాడకపోతే దిగుబడి రావడం కష్టం. నత్రజని, భాస్వరం, పొటాషియం వంటివి అందించడంతో పైరు పెరుగుదలకు బాగుంటుందని వాడుతున్నాం.

- రవి, రైతు, శ్రీధరఘట్ట

అవగాహన కల్పిస్తున్నాం



ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మోతాదుకు మించి ఎరువులు వాడడంవల్ల కలిగే నష్టాన్ని తెలియజేస్తున్నాం. ఏ పంటకు, ఏ సమయంలో, ఎంత ఎరువు వాడాలి? అనేది తెలిస్తే పంట దిగుబడిలో ప్రయోజనం కనిపిస్తుంది. ఆ దిశగా రైతులకు సూచనలు ఇస్తున్నాం. భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులు రసాయన, సేంద్రియ ఎరువులు సగం మోతాదులో వాడాల్సి ఉంది. కేవలం రసాయన ఎరువులే వాడటం వల్ల భూసారం తగ్గిపోయి, నిస్సారంగా మారుతుంది. మొదట్లో బాగానే దిగుబడులు వచ్చినా క్రమంగా భూసారం తగ్గి దిగుబడులు రావు. సేంద్రియ ఎరువులు వాడడం వల్ల నేలలు గుల్లబారి, వేర్లు చక్కగా పెరగడానికి సహాయపడుతుంది.

- సాయికుమార్, ఏఓ, బొమ్మనహాళ్

జాతీయ బ్యాంకులకు దీటుగా..

అర్బన్ బ్యాంకు ప్రస్థానంపై చైర్మన్ జేఎల్ మురళీధర్



అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వందేళ్ల బ్యాంకు లైసెన్సు రద్దు పరిస్థితి నుంచి అర్బన్ బ్యాంకుగా రూపాంతరం చెందింది. అధునాతన హంగులతో నూతన భవనాన్ని నిర్మించి ప్రైవేటు, జాతీయ బ్యాంకులకు దీటుగా ది అనంతపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకును తీర్చిదిద్దారు చైర్మన్ జేఎల్ మురళీధర్. ఆయనతో ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్ర: ఎలాంటి పరిస్థితిల్లో టౌన్‌బ్యాంకు బాధ్యతలు స్వీకరించారు ?

జః 2014-15 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ లైసెన్సు రద్దు చేసే పరిస్థితుల్లో మా పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. అంతా అస్తవ్యస్తంగా ఉండేది. ఏమీ అర్థమయ్యేది కాదు.

ప్ర: పాలకవర్గం బాధ్యతలు తీసుకునే సమయంలో ఎంత టర్నోవర్ ఉండేది....?

జః రూ.4.3కోట్లు డిపాజిట్లు, రూ.8కోట్లు రుణాలతో మొత్తం రూ.32కోట్ల వ్యాపారం టర్నోవర్ మాత్రమే ఉండేది. శిథిలావస్థకు చేరిన భవనంలో ఎప్పుడు కూలుతుందో అనే భయాందోళన పరిస్థితి ఉండేది. 34శాతం ఎన్‌పీఏ ఉండేది. పైగా ఉద్యోగులు ఒక పనికే పరిమితమయ్యారు.

ప్ర: మీరు ఎలాంటి మార్పులు తెచ్చారు?

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జః బ్యాంకును సవ్యంగా నడపడానికి తొలుత ఆర్‌బీఐను ఆరు నెలల సమయం కోరా. ఆ ఆరు నెలల పాటు బ్యాంకులో ఉన్న పరిస్థితులను అధ్యయనం చేశా. ఉద్యోగుల శిక్షణకు శ్రీకారం చుట్టాను. సమయపాలన, బయోమెట్రిక్‌తో పాటు ఖాతాదారులతో మర్యాదగా మెలిగే వాతావరణాన్ని సృష్టించా. ఒకే సీటుకి పరిమితమైన ఉద్యోగులకు ఇతర పనులు చేయడాన్ని కూడా అలవాటు చేశాం.

ప్ర: 34శాతం ఎన్‌పీఏను ఎలా తగ్గించారు?

జః ఎన్‌పీఏ తగ్గించేందుకు రుణాల రికవరీకి స్పెషల్‌డ్రైవ్ చేపట్టాం. ప్రత్యేక వాహనంలో బహిరంగంగా మైకులో బకాయిదారుల ఇళ్ల వద్ద ప్రకటన చేయడం ప్రారంభించాం. దీంతో మొండి బకాయిదారులు రుణాలు కట్టేందుకు ముందుకు వచ్చారు. ఇలా ఎన్‌పీఏను తగ్గిస్తూవచ్చాం.

ప్ర: ఉద్యోగులు, పాలకవర్గం సహకారం ఎలా ఉంది....?

జః ప్రధానంగా ఉద్యోగులు సత్ప్రవర్తనతో ఉండేలా డ్రెస్ కోడ్, తగినంత వేతనాలు పెంచి, కుటుంబసభ్యులుగా భావించా. పాలకవర్గం గౌరవ వేతనం లేకుండా పనిచేస్తూ...ఉద్యోగులను ప్రోత్సహిస్తూ వచ్చాం. ఆధునిక వసతులు, ఫర్నిచర్, కంప్యూటర్లు ఏర్పాటు చేయడంతో ఉద్యోగులు పనితీరు మెరుగుపడింది. బ్యాంకును నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకువచ్చాం.

ప్ర: ప్రజలకు టౌన్‌బ్యాంకుపై ఎలా నమ్మకం కలిగించారు...?

జః టౌన్‌బ్యాంకులో టర్నోవర్ పెంచడంతో అర్బన్‌బ్యాంకుగా ప్రమోట్ చేస్తూ ఆర్‌బీఐ గుర్తించింది. దీంతో ప్రజల ఆదరణతో నూతన భవనాన్ని నిర్మించాం. రాజకీయలకతీతంగా శ్రీకృష్ణదేవరాయభవన్‌గా నామకరణం చేశాం. నాలుగు బ్రాంచ్‌లను అధునాతన హంగులతో నవీనీకరించాం.

ప్ర: ఎంతమందికి, ఎంత రుణాలు ఇచ్చారు....?

జః ప్రస్తుతం 22వేల మంది చిరువ్యాపారులు, తోపుడు బండ్లు, టీకొట్లు, సెలూన్‌షాపులు, గృహరుణాలు రూ.10వేలు నుంచి రూ.కోటి వరకు మొత్తం రూ.73కోట్లు రుణాలు ఇచ్చాం. రూ.107.19కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. మొత్తం వార్షిక టర్నోవర్ రూ.926.75కోట్లుగా ఉంది. ఎన్‌పీఏ సున్నాగా ఉంది.

ఎమ్మెల్యే గుమ్మనూరు క్షమాపణ చెప్పాలి

- రైతు, వ్యవసాయ, కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకుల డిమాండ్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పట్ల అసభ్య పదజాలంతో మాట్లాడిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బేషరతుగా క్షమాపణ చెప్పాలని రైతు, వ్యవసాయ, కార్మిక, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఏపీ రైతుసంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడారు. గుత్తి, పామిడి మండలాల్లో ఏర్పాటు చేయబోతున్న సోలార్ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణను పరిశీలించేందుకు వెళ్లిన రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డిపై ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నోరు పారేసుకున్నారన్నారు. అరగంటలో అక్కడినుంచి ఖాళీ చేయకపోతే తరిమి తరిమి కొడతామని బెదిరించేలా ఫోన్‌లో మాట్లాడారన్నారు. గుంతకల్లు నియోజకవర్గం బేతాపల్లిలో సోలార్ ప్రాజెక్టుకోసం పెద్దఎత్తున భూములు సేకరిస్తున్నారనీ, ఉపాధి కల్పన పేరుతో కంపెనీ యాజమాన్యంతో కుమ్మక్కై కోట్లాది రూపాయల అక్రమ సంపాదనకు ఎమ్మెల్యే.. తన అనుచరుల ద్వారా తెరలేపారని ఆరోపించారు. అందులో భాగంగా రైతులను బెదిరిస్తూ కంపెనీకి భూములు ఇచ్చేలా చేస్తున్నారన్నారు. ఇది బయటకు పొక్కడంతో రైతుసంఘం నేతలు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారన్నారు. వారిని బెదిరిస్తూ దుర్భాషలాడడం సరికాదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోరారు. బలవంతంగా భూసేకరణ చేయొద్దన్నారు. భూమి లీజు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

భారత జట్టుకు ఆడాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్ ● ఏసీఏ క్రికెట్ టోర్నీ ప్రారంభం



టాస్‌వేసి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత జట్టుకు ఆడాలని క్రికెటర్లకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నేషనల్ ఇన్విటేషనల్ అండర్-19 క్రికెట్ టోర్నీని కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రికెటర్లు అవకాశాలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. యువత దురలవాట్లకు దూరంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి, ఏసీఏ జూనియర్ జట్టు సెలెక్షన్ కమిటీ చైర్మన్ అచ్యుతరావు, సెలెక్టర్ లీలా మోహన్‌రెడ్డి, సభ్యులు షబ్బీర్‌అహ్మద్, రంజీ మాజీ ప్లేయర్ సురేష్, మచ్చా రామలింగారెడ్డి, ప్రసన్న, విజయ్‌కుమార్, మహ్మద్ రఫీ, సర్దార్, శ్రీనివాసరెడ్డి, కమలాకర్ నాయుడు పాల్గొన్నారు.



ఈశ్వర్ రితిక్



విశ్వాస్ పటేల్



వీరారెడ్డి

ఏసీఏ సెక్రటరీ, బరోడా జట్ల బోణీ

తొలిరోజు పోటీల్లో ఏసీఏ సెక్రటరీ లెవెన్, బరోడా జట్లు బోణీ చేశాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో ఏసీఏ సెక్రటరీ లెవెన్, మధ్యప్రదేశ్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఏసీఏ సెక్రటరీ జట్టు 40.4 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌటైంది. ఈశ్వర్ రితిక్ (78), సిద్దు కార్తీక్‌రెడ్డి (67) హాఫ్ సెంచరీలతో రాణించారు. అనంతరం బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ 48.1 ఓవర్లలో 217 పరుగులకే ఆలౌటైంది. అర్యన్ శర్మా (74) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఏసీఏ సెక్రటరీ జట్టు 12పరుగుల తేడాతో గెలుపొందింది. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో బరోడా, ఏసీఏ ప్రెసిడెంట్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఏసీఏ ప్రెసిడెంట్ జట్టు 46.5 ఓవర్లలో 235 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ వీరారెడ్డి (68బంతుల్లో 9 బౌండరీలు, 5 సిక్సర్లతో 97) చెలరేగాడు. 3 పరుగులతో సెంచరీ చేజార్చుకున్నాడు. అనంతరం బరిలోకి దిగిన బరోడా జట్టు 38.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసింది. విశ్వాస్ పటేల్ సెంచరీ (105)తో చెలరేగి జట్టుకు 6 వికెట్ల తేడాతో విజయాన్ని అందించాడు.

మహిళా హక్కుల సాధనకు ఏకమవుదాం

- ఐద్వా జాతీయ నేత పుణ్యవతి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): హక్కులను సాధించుకునేందుకు మహిళలు ఏకమవుదామని ఐద్వా జాతీయ నేత పుణ్యవతి పిలుపునిచ్చారు. స్థానిక లలితకళాపరిషత్ మినీ హాల్‌లో బుధవారం నిర్వహించిన ఐద్వా జిల్లా మహాసభకు పుణ్యవతి హాజరయ్యారు. తొలుత పతాకాన్ని ఆవిష్కరించి, అరుణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పుణ్యవతి మట్లాడుతూ.. మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆగడాలకు అధికంగా మహిళలే బాధితులు అవుతున్నారన్నారు. వెంటనే రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మద్యం, మత్తు పదార్థాల వినియోగం వల్ల ఇళ్లలో మహిళలు హింస అనుభవిస్తున్నారన్నారు. సరైన పౌష్టికాహారం లేక రక్తహీనతతో ఎక్కువ మంది స్త్రీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్త్రీలు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వాలు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో మహిళలు హక్కుల సాధనకు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ... అక్టోబరు 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఐద్వా జిల్లా నాయకురాలు చంద్రకళ భవిష్యత్ కార్యాచరణ నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, నేత డాక్టర్ ప్రసూన పాల్గొన్నారు.



అరుణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఐద్వా నేతలు

జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఐద్వా మహాసభలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షురాలిగా శ్యామల, ప్రధాన కార్యదర్శిగా చంద్రిక, కోశాధికారిగా అశ్విని, కార్యదర్శులుగా శంషాద్, రామాంజినమ్మ, సుజాత, గీత, శైలజ, రేణుక, రంగమ్మ, కృష్ణవేణి, లక్ష్మీదేవి, నడిపక్కను ఎన్నుకున్నారు.

అంచనాలకు మించి మంచి

(5వ పేజీ తరువాయి)

అన్నారు. పథకాల సక్సెస్ మీట్ అనంతపురంలో లో నిర్వహిస్తుండటం ఆనందంగా ఉందని అన్నారు.

- ఎన్నికలలో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు సమష్టిగా పనిచేసి జిల్లాలో 14 ఎమ్మెల్యే స్థానాలను క్లీన్‌స్వీప్ చేశామని అహుడా చైర్మన్ టీసీ వరుణ్ అన్నారు. ఈ నెల 10న జరిగే బహిరంగసభకు రాయలసీమ నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. 2019 నుంచి 2024 మధ్యలో రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన సాగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ అన్నారు. ఆ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, పార్టీ జోనల్ కో ఆర్డినేటర్ కోవెపూడి రవీంద్ర, రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

అనంతపురం కలెక్టరేట్: సూపర్ సిక్స్- సూపర్‌హిట్ సభ ఏర్పాట్లను కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ తదితరులు పరిశీలించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో చర్చించారు. హెలిప్యాడ్, సభాస్థలి, పార్కింగ్ తదితర ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకుని, పలు సూచనలు జారీ చేశారు. జేసీ శివనారాయణ శర్మ, గుంటూరు మేయర్ కోవెలమూడి నాని తదితరులు సభ మ్యాప్, ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, డీపీఓ నాగరాజునాయుడు, నగర కమిషనర్ బాలస్వామి, తహసీల్దార్లు హరికుమార్, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ప్రజా ప్రతినిధులు, నాయకులు

సాహిత్యం, సైన్స్ నాణేనికి రెండు ముఖాలు

- ఆచార్య రామకృష్ణారెడ్డి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సాహిత్యం, సైన్స్ భిన్నాంశాలు కావనీ, ఒక నాణేనికి రెండు ముఖాలు అని ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల వాణిజ్య శాఖ సమావేశ మందిరంలో ఆంధ్రభారతి తెలుగుశాఖ ఆధ్వర్యంలో బుధవారం 'డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ సాహిత్యంలో వైవిధ్యం' అనే అంశంపై సాహితీ సమాలోచన నిర్వహించారు. కార్యక్రమంలో ఆచార్య రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వేణుగోపాల్ సాహిత్యంలో జరిగిన పరిశోధనలు భావితరం రచయితలు తమ రచనలకు మెరుగులు దిద్దేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. సాహిత్యం సమాజానికి చూపు వంటిదనీ, సైన్స్ ఆలోచన వంటిదని విశ్లేషించారు. నాగసూరి వేణుగోపాల్ బహుముఖ ప్రజ్ఞాశాలి అనీ, ఆలిండియా రేడియో డైరెక్టర్‌గా, సాహితీ పరిశోధకుడిగా అనేక పాత్రలను నిర్వర్తించారన్నారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి మాట్లాడుతూ... సాహిత్యం, సైన్స్ సామాజిక పురోభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. జన మాధ్యమాల్లో తెలుగు భాష భిన్న రూపాలను సంతరించుకుంటున్న తీరును నాగసూరి వేణుగోపాల్ గుర్తించి నిర్దిష్టంగా విశ్లేషించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు అంకె శ్రీనివాసులు, తూముచెర్ల రాజారాం, డాక్టర్ హేమమాలిని, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, తాళంకి జీవన్‌కుమార్, డాక్టర్ జీఎల్ఎన్ ప్రసాద్, అధ్యాపకులు మాధవీలత, డాక్టర్ నాగేశ్వర్‌నాయుడు, అంకె మదన్‌మోహన్ పాల్గొన్నారు.



సాహితీ సమాలోచనలో మాట్లాడుతున్న ఆచార్య రామకృష్ణారెడ్డి

ఏఆర్టీని సిద్ధంగా ఉంచాలి

- డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా



ఏఆర్టీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఆర్ఎం

గుంతకల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రమాదాలు జరిగినపుడు ఉపయోగపడే యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్ (ఏఆర్టీ)ని ఏ సమయంలోనైనా బయలుదేరే విధంగా సర్వసన్నద్ధంగా ఉంచాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లోని సీఅండ్‌డబ్ల్యూ స్టోర్ వద్ద ఉన్న యార్డులో ఏఆర్టీని బుధవారం డీఆర్ఎం తనిఖీ చేశారు. ఏఆర్టీ సిబ్బందితో మాట్లాడుతూ... రైలు ప్రమాదాలు జరిగినపుడు అత్యవసరంగా ఘటనా స్థలానికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. తక్షణ వైద్య సహాయం, పునరుద్ధరణ సేవలను సత్వరం అందించాల్సి ఉంటుందన్నారు. ఆ దిశగా ఏఆర్టీలో అవసరమైన కిట్లు, వైద్య పరికరాలను ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో మెకానికల్, సిగ్నలింగ్, ఎలక్ట్రికల్, మెడికల్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీనారాయణ

మడకశిర టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్‌గా లక్ష్మీనారాయణ విజయవాడలోని బీసీ భవనంలో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. బాధ్యతలు తీసుకున్న ఆయన మాట్లాడుతూ.. పార్టీ గుర్తించి తనకు ఇంతటి పదవిని ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. టీడీపీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు తప్పకుండా దక్కుతుందన్నారు. పదవులు పొందినవారు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండలాల కన్వీనర్లు, సింగిల్‌విండో అధ్యక్షులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి


మృతి చెందిన వరుణ్

విడపనకల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన సింగాడి రామాంజనేయులు కుమారుడు వరుణ్(8) బుధవారం సాయంత్రం ఈతకు వెళ్లి మృతి చెందాడు. మూడో తరగతి చదువుతున్న వరుణ్ సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చాక ఎస్సీ కాలనీకి ఆనుకుని ఉన్న జీబీసీ పిల్ల కాలువలో తన స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు వెళ్లాడు. బీరప్ప బ్రిడ్జి వద్ద ఈత కొడుతూ ప్రమాదవశాత్తు కాలువ ప్రవాహంలో కొట్టుకుపోయాడు. బాలుడి స్నేహితుల సమాచారంతో స్థానికులు కాలువ వద్దకు వెళ్లి గాలింపు చేపట్టగా బాలుడు ఆర్ కొట్టాల రోడ్డు బ్రిడ్జి వద్ద కనిపించాడు. వెంటనే నీటిలో నుంచి విద్యార్థిని బయటకు తీసి ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. రామాంజనేయులుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కాగా రామాంజనేయులు దంపతులు జీవనోపాధి కోసం బళ్లారిలో ఉంటూ కుమారుడిని తన తల్లి వద్ద విడపనకల్లులోనే ఉంచి చదివిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


అంజనారెడ్డి(ఫైల్)

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగాల గ్రామానికి చెందిన రైతు అంజనారెడ్డి(58) అప్పులబాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు అంజనారెడ్డికి 6 ఎకరాల పొలం ఉంది. గత ఐదేళ్లుగా వేరుశనగ, కంది పంటలను సాగు చేశాడు. ఇందుకోసం రూ. 15లక్షల దాకా అప్పు చేశాడు. పంటలు పండకపోవడంతో అప్పులు ఎలా తీర్చేదని మథనపడేవాడు. ఈక్రమంలోనే అనారోగ్యానికి గురైయ్యాడు. ఒక పక్క అప్పులు, మరోపక్క ఆరోగ్య సమస్యలతో తీవ్రంగా కుంగిపోయాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కసాపురం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించా రు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య మాధవి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గోరంట్లలో టీకొట్టు నిర్వాహకుడు..

గోరంట్ల, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయం ఎదుట టీ కొట్టు నిర్వహిస్తున్న శివశంకర్(40) బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గ్రామస్థులు తెలిపిన మేరకు మండలంలోని బుచేపల్లి గ్రామానికి చెందిన శివశంకర్, సుజాత దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల గ్రామం వదిలి గోరంట్లలో నివాసముంటు, భార్యభర్తలిరువురు టీకొట్టు నిర్వహిస్తున్నారు. కాగా, బుధవారం పాలసముద్రం వద్ద పాఠశాలలో చదువుతున్న కుమారుడిను పలకరించి వస్తానంటూ భార్యకు చెప్పి వెళ్లిన శివశంకర్ స్వగ్రామంలో ఊరి చివర ఉన్న సొంత పొలంలో చింతచెట్టుకు ఉరివేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇటీవల ఇళ్లు తాకట్టు పెట్టినట్లు సమాచారం. సీఐ శేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో యువతి..


పుష్పావతి (ఫైల్)

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన నాగిరెడ్డి, తిరుమలమ్మ దంపతుల కుమార్తె పుష్పావతి(19) బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కసాపురం పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు పుష్పావతి ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉండేది. కొద్ది రోజులుగా ఈమె కడుపునొప్పితో బాధపడుతుండేది. పలు చోట్ల చికిత్సలు చేయించిన నొప్పి తగ్గకపోవడంతో మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోటంకలో యువకుడు..


సుబ్బరాయుడు (ఫైల్)

గార్లదిన్నె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక గ్రామంలో జెన్నె సుబ్బరాయుడు (35) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు జెన్నె సుబ్బరాయుడు, రమాదేవి దంపతులు గ్రామంలో కూలి పనులు చేసుకునేవారు. సుబ్బరాయుడు బుధవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు తీసి చూడగా సుబ్బరాయుడు విగతజీవిగా ఫ్యానుకు వేలాడుతు కనిపించాడు. దీంతో వారు బోరు మనడంతో చుట్టు పక్కల వారు వచ్చి, ఉరికి వేలాడుతున్న సుబ్బరాయుడును కిందికి దించి పరీక్షించి, మృతి చెందినట్లు గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గాయపడిన వృద్ధుడి మృతి

● కొడుకులిద్దరిపై హత్య కేసు

గోరంట్ల , సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్రారంపల్లికి చెందిన వడ్డె రంగప్ప (62) గాయపడి, కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి సోముశేఖర్, చంద్రశేఖర్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు అదే గ్రామంలో విడిగా నివసిస్తుండగా, రంగప్ప భార్యతో కలిసి జీవిస్తున్నాడు. మృతుడు తాగుడుకు బానిసై తరచూ భార్యను హింసించేవాడు. బాధ తాళలేక ఆమె ఈనెల 1న కుమారుల వద్దకు వెళ్లింది. కుమారులు ఆగ్రహంతో తండ్రి రంగప్పను కొట్టారు. గాయపడిన రంగప్ప ఓడీసీ మండలం చింతమానుపల్లిలో ఉంటున్న కుమార్తె అరుణమ్మకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. దీంతో కుమార్తె వచ్చి తండ్రిని తనతోపాటు తీసుకెళ్లి, చికిత్స చేయించారు. అనంతరం ఇంటిలో విశ్రాంతి పొందుతుండగా, తలనొప్పి తీవ్రంకావడంతో కదిరి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. వానవోలు వీఆర్‌ఓ లక్ష్మీనరసమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కొడుకులిద్దరిపై హత్య కేసు నమోదు చేశారు.



పంచరత్నాలు

ఉమ్మడి జిల్లాలో ఐదుగురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

అనంతపురం విద్య/కొత్తచెరువు/రొద్దం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇచ్చే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఉమ్మడి జిల్లాలో ఐదుగురిని వరించాయి. ఈమేరకు బుధవారం అధికారికంగా ప్రకటించారు. రాష్ట్రంలో 78మందికి ఈ అవార్డులు ప్రకటించగా, అనంత జిల్లాకు చెందిన ముగ్గురు , శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఇద్దరికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు దక్కాయి. వీరిలో రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు జడ్పీ హైస్కూల్‌లో బయాలజీ టీచర్‌గా పనిచేస్తున్న ఉప్పరపల్లి శైలజ, గుత్తి మండలం అబ్బేదొడ్డి జడ్పీ హైస్కూల్ ఫిజికల్ సైన్స్ టీచర్ బండి శ్రీనివాసులు, పామిడి ఏపీమోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అరుణ, కొత్తచెరువు మండలం బండ్లపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు మాణిక్యం మహమ్మద్ ఇషాక్, రొద్దం మండలం కోగిర జడ్పీ హైస్కూల్‌లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న జాబిలి చాంద్‌బాషా ఉన్నారు. వీరు ఈనెల 5న రాజధానిలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారాలోకేశ్ చేతుల మీదుగా అవార్డులు స్వీకరించనున్నారు.

● రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన బండ్లపల్లి జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు మాణిక్యం మహమ్మద్ ఇషాక్ 30 ఏళ్లుగా బోధనా వృత్తిలో కొనసాగుతున్నారు. మూడు దశాబ్దాల అనుభవంలో ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి శ్రమించారు. పిల్లలకు భాషపై పట్టు రావడానికి ఎంతగానో కృషి చేశారు. అలాగే కమిసమ్మేళనాలు నిర్వహించారు. మాణిక్యమ్మ శతకం, ద్విశతఆటవెలది చందస్సులో 216 పద్యాల పుస్తకాన్ని రచించారు. ఈ సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించింది.



● రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా జాబిలి చాంద్‌బాషా (జయచంద్ర) ఎంపికయ్యారు. రొద్దం మండలం కోగిర జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న జాబిలి చాంద్‌బాషా, పాఠశాల అభివృద్ధి కోసం విశేష కృషి చేసినందుకు అవార్డు దక్కింది. దీనిపై పాఠశాల సహచర ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని జాబిలి చాంద్‌బాషా పేర్కొన్నారు.



సంతోషంగా ఉంది



రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు దక్కడం సంతోషం కలిగిస్తోంది. నేను డీఎస్సీ-1996లో ఎస్జీటీగా ఎంపికయ్యా. 2009 స్కూల్‌అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొంది ఉరవకొండలో పదేళ్లు పని చేశా. ఇపుడు ఆత్మకూరు హైస్కూల్‌లో పని చేస్తున్నా. ఎక్కడకు వెళ్లినా పర్యావరణం విషయంలో పిల్లలకు మంచిగా తీర్చిదిద్దుతూనే ఉన్నా. నా సొంత బిడ్డల్లా భావించి పిల్లలకు బోధన చేసి వారిలో మార్పు తీసుకొస్తున్నా. పిల్లలకు నేనంటే ఎంతో ఇష్టం. ఇపుడు అవార్డు రావడానికి ఇదే అవకాశం కల్పించింది.

- శైలజ, బయాలజీ టీచర్, జడ్పీహెచ్ఎస్, ఆత్మకూరు.

మరపురాని గుర్తింపు



నేను 2015 డీఎస్సీలో టీజీటీగా ఎంపికయ్యా, ఆతర్వాత 2018 డీఎస్సీలో అదే మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పోస్టుకు పరీక్షరాసి సెలెక్ట్ అయ్యా. అప్పటి నుంచి ప్రిన్సిపాల్‌గా పామిడిలో విధులు నిర్వహిస్తూ స్కూల్ అభివృద్ధితో పాటు విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు శ్రమిస్తున్నా. చిన్నవయసులోనే రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు దక్కడం ఎంతో ఆనందం కలిగిస్తోంది. జీవితంలో ఇది మరిచిపోని గుర్తింపు.

- అరుణ, ఏపీమోడల్‌స్కూల్, ప్రిన్సిపాల్, పామిడి

వినూత్న బోధనతోనే గుర్తింపు



నేను పిల్లలకు తొలి నుంచి వినూత్న విధానంలో బోధన చేస్తూ వస్తున్నా. డీఎస్సీ- 1996లో ఎస్జీ టీచర్‌గా ఎంపికయ్యా. ఆతర్వాత 2003డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా పరీక్ష రాసి ఫిజిక్స్ టీచర్‌గా సెలెక్ట్ అయ్యా. అప్పటి నుంచి పిల్లలకు సాంకేతిక విధానంలో సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నా. 2017లో జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ తరపున మొదటి బహుమతి పొందాం. ఈక్రమంలోనే ప్రభుత్వం రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో గర్వంగా ఉంది.

- బండి శ్రీనివాసులు, ఫిజికల్‌సైన్స్ టీచర్, అబ్బేదొడ్డి, గుత్తిమండలం.

జిల్లాలో 9 బార్లకు రీ నోటిఫికేషన్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 9 బార్లకు రీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురంలో -3, గుంతకల్లు-2, తాడిపత్రి, గుత్తి, కళ్యాణదుర్గం, రాయదుర్గంలో ఒకటి చొప్పున బార్లు ఉన్నాయన్నారు. 2025-28 నూతన బార్ పాలసీలో భాగంగా గతంలో లాటరీ నిర్వహించగా జిల్లాలో మిగిలిపోయిన ఈ 9 బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిందన్నారు. ఈనెల 14న సాయంత్రం 6 గంటల వరకూ ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవచ్చున న్నారు. 15న ఎక్సైజ్ ఈఎస్ కార్యాలయంలో కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ తీస్తామన్నారు.

టమోటా కిలో రూ.21

అనంతపురం రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో బుధవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.21తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.14, సరాసరి రూ.17తో విక్రయాలు జరిగాయన్నారు.

చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు.

తాడిపత్రిలో భారీ పోలీసు బందోబస్తు


డీఎస్పీ ఆఫీసు వద్ద పెద్దఎత్తున పోలీసులు

తాడిపత్రి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తున్నాడనే సమాచారంతో పోలీసులు బుధవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తున్నాడని తెలియడంతో జేసీప్రభాకర్‌రెడ్డి డీఎస్పీ ఆఫీసు వద్దకు వెళ్లాడని విశ్వసనీయ సమాచారం. కానీ పెద్దారెడ్డి రాలేదని తెలియడంతో ప్రభాకర్ రెడ్డి కూడా అక్కడకు వెళ్లకుండా విరమించుకోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. కానీ ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆలోచనతో సబ్‌డివిజన్ నుంచి పెద్దఎత్తున పోలీసు బలగాలను రప్పించారు. సబ్‌డివిజన్‌తోపాటు పుట్లూరు, యల్లనూరు మండలాల నుంచి సీఐలు, ఎస్ఐలు హుటాహుటినా డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. ఇప్పటికే మూడురోజుల క్రితం కాకర్ల రంగనాథ్, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గాల మధ్య జరిగిన ఘర్షణతో తలబొప్పి కట్టిన పోలీసులకు పెద్దారెడ్డి వస్తాడన్న సమాచారంతో నిద్రపట్టడంలేదు.

తిమ్మంపల్లికి చేరుకున్న పెద్దారెడ్డి అనుచరులు

యల్లనూరు: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్వగ్రామమైన తిమ్మంపల్లికి బుధవారం తెల్లవారుజామున ఆయన అనుచరులు చేరుకోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లడానికి బుధవారం ఉదయాన్నే రావాలని తన అనుచరులకు సమాచారం అందించారు. అయితే మంగళవారం రాత్రి పోలీసులు జరిపిన చర్చలతో తాడిపత్రికి వెళ్లే కార్యక్రమం వాయిదా వేసుకున్నారు. అయినా బుధవారం ఉదయాన్నే పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన ఆయన అనుచరులు తిమ్మంపల్లికి చేరుకున్నారు. దీంతో ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో బందోబస్తు నిర్వహించారు.

యూరియా విషయంలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి బుధవారం యూరియా సరఫరా, డిమాండ్‌పై జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీసీలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా ఎస్పీ జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారితో మాట్లాడుతూ జిల్లాలో అవసరమైన చోట రైతు సేవ కేంద్రాలలో యూరియా స్టాక్‌ను ఉంచాలన్నారు. పంట సాగును బట్టి ఎక్కడ అవసరమో అక్కడ యూరియాను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

టీచర్స్‌డేకు నిధులు మంజూరు

అనంతపురం విద్య, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకలకు ప్రభుత్వం రూ.లక్ష నిధులు మంజూరు చేసింది. ఆరోజు విద్యాశాఖ ఆధ్వర్యంలో 60మంది ఉత్తమ టీచర్లను కలెక్టరు, జేసీ, ప్రజాప్రతినిధుల చేతులు మీదుగా సత్కరించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. గత వైసీపీ పాలనలో నిధులు ఇవ్వకపోవడంతో చందాల ద్వారా టీచర్స్‌డేను నిర్వహించేందుకు ఇబ్బంది పడేవారు. వీటిని గమనించిన ప్రస్తుత ప్రభుత్వం ఈ టీచర్స్‌డేను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి జిల్లాకు రూ.లక్ష నిధులు మంజూరు చేసింది. సమగ్రశిక్ష నుంచి వెంటనే ఆ నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఎస్పీడీ శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.

విద్యార్థుల చేత చేపల శుభ్రంపై డీఈఓ ఆగ్రహం

అనంతపురం విద్య/కణేకల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలం యర్రగుంట జడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యార్థుల చేత చేపలు శుభ్రం చేయించడంపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు చేపలను శుభ్రం చేసే ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం ఓ కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై కలెక్టరు వినోద్‌కుమార్, ఆర్జేడీ శామ్యూల్ ఆరా తీశారు. దీంతో డీఈఓ చేపల శుభ్రం వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని గుత్తి డివిజన్ డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డిని ఆదేశించారు. ఆమేరకు ఎంఈఓ 1 లక్ష్మణ్ణ, ఎంఈఓ 2 భవానీశంకర్‌లు పాఠశాలకు చేరుకుని విచారణ జరిపారు.

భూసార సంరక్షణా విభాగం ఈఈగా పోలప్ప

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం భూసార సంరక్షణా విభాగం ఈఈగా పోలప్ప బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కదిరి భూసార సంరక్షణా విభాగం డీఈగా పనిచేస్తున్న పోలప్పను ఉద్యోగోన్నతిపై అనంతపురం భూసార సంరక్షణా విభాగం ఈఈగా బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పట్టపగలే చోరీ

గోరంట్ల , సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలోని వస్త్ర దుకాణం ఎదుట ద్విచక్రవాహనంలో ఉంచిన రూ.4లక్షల నగదును బుధవారం చోరీ చేశారు. మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన కరణం భుజంగరావు, హరిప్రియ దంపతులు ద్విచక్రవాహనంపై గోరంట్లలోని స్టేట్ బ్యాంక్‌కు వచ్చారు. బెంగుళూరుకు వెళ్లాలన్న ఉద్దేశ్యంతో బ్యాంక్‌లో రూ.4 లక్షల నగదును డ్రా చేశారు. అనంతరం సమీపంలోని దుకాణంలో దుస్తులు కొనుగోలు చేయడానికి వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా వాహనంసైడ్ బ్యాగ్‌లో ఉన్న నగదు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా, ఇద్దరు మహిళలు బ్యాంక్ వద్ద నుంచి బాధితులను వెంబడిస్తూ వచ్చి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చోరీ అనంతరం నిందితులు కారులో బెంగళూరు వైపు వెళ్లినట్లు తెలిసింది.

గ్రామీణప్రాంతాల అభివృద్ధే కియ లక్ష్యం

సంస్థ ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కప్ డాంగ్లీ


చోళేమర్రిలో రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న డాంగ్లీ

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా కియ ఇండియా పనిచేస్తుందని ఆ సంస్థ ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కప్‌డాంగ్లీ అన్నారు. సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా పెనుకొండలోని వెంకటాపురంతండాకు వెయ్యి సోలార్ వీధి దీపాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలో సోలార్ వీధిదీపాలపై యువతకు అవగాహన కల్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కప్‌డాంగ్లీ మాట్లాడుతూ మొదటి విడతలో 250సోలార్ వీధిదీపాలు ఏర్పాటు చేసిందన్నారు. మరో వెయ్యి సోలార్‌దీపాలు త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గతఏడాది మొదటి దశలో రైతుల ఆదాయం పెంపొందించేందుకు 544మంది రైతులతో పండ్ల మొక్కలు నాటించి, వారి ఆర్థిక అభివృద్ధికి కృషిచేశామన్నారు. ఈక్రమంలోనే బుధవారం రొద్దం మండలంలోని చోళేమర్రి గ్రామంలో 600మంది రైతులకు, 40వేల మొక్కలు, పండ్ల తోటలు సాగుచేసే రైతులకు ఉపాధి పథకం ద్వారా డ్రిప్ పరికరాలు అందించామన్నారు. మొక్కలను కాపాడుకునేందుకు ప్రత్యేక నిపుణులచే ప్లాంట్‌కేర్ అడ్వైజ్ సేవలందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వైజర్ డాంగిల్‌మా తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలకు ప్రతిరూపం

శ్రీసత్యసాయి వైద్య సేవలపై కేరళ ఎంపీ


ప్రసంగిస్తున్న కేరళ ఎంపీ ప్రేమచందన్

పుట్టపర్తి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిస్వార్థ సేవలకు శ్రీసత్యసాయి వైద్యసేవలు పేరొందాయని కేరళ రాష్ట్రం కొల్లం జిల్లా ఎంపీ ఎన్కే ప్రేమచందన్ కొనియాడారు. ప్రశాంతి నిలయంలో బుధవారం కేరళ ఓనం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. కేరళ ఎంపీ ప్రసంగిస్తూ సత్యసాయి వైద్యసేవల్లో నో క్యాష్ కౌంటర్, నో బిల్‌సెంటర్ ఉంటుందన్నారు. నిస్వార్థంతో చేసే సేవలు దేవుడికి చేరుతాయన్నారు. అనంతరం కొజీ కోడ్ విద్యార్థులు సత్యసాయి ఆధ్యాత్మికతపై సంగీత నృత్యాన్ని ప్రదర్శించారు. గంటపాటు మధుర గాన, నృత్యంతో భక్తులు తన్మయం చెందారు.

పెన్నహోబిలం ఇన్‌చార్జి ఈవోగా తిరుమల రెడ్డి

ఉరవకొండ,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా తిరుమల రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు ఇక్కడ పనిచేస్తున్న ఈవో రమేష్ బాబు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో జిల్లా దేవదాయ శాఖాధికారి బాధ్యతలు స్వీకరించారు.

విష ప్రభావంతో రైతు మృత్యువాత



చిన్న పెద్దప్ప (ఫైల్)

పెద్దవడుగూరు, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన చిన్నపెద్దప్ప (50) అనే రైతు విషప్రభావానికి గురై చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు చిన్నపెద్దప్ప రెండు ఎకరాల విస్తీర్ణంలో పత్తిపంటను సాగుచేశాడు. పంటకు చీడపీడలు ఆశించడంతో గత ఆదివారం క్రిమి సంహారక మందును పిచికారీ చేశాడు. ఈక్రమంలో విష ప్రభావానికి గురై తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి కుమార్తె ఉంది. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి


పుట్లూరు పెద్దారెడ్డి (ఫైల్)

పుట్లూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని పి. చింతలపల్లి గ్రామానికి చెందిన రైతు పుట్లూరు పెద్దారెడ్డి (38) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు పెద్దారెడ్డికి 7ఎకరాల భూమి ఉంది. వీటిలో అరటి, మొక్కజొన్న పంటలు సాగు చేయగా నష్టపోయాడు. పెట్టుబడులకు చేసిన అప్పులు పెరిగిపోయాయి. రుణదాతల ఒత్తిడితో మనస్తాపం చెంది ఈ నెల 28న ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స మూడు రోజుల పాటు వైద్యం చేయించుకొని డబ్బులు లేక ఇంటికి వచ్చారు. పరిస్థితి విషమించడంతో మళ్లీ అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు సీఐ సత్యబాబు తెలిపారు. మృతుడి భార్య వీణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్‌డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర:7382114647

AJA- 246587

ఉచిత విద్యావకాశాలు

ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing). B.Sc (MLT),BPT (ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్‌టెస్ట్ కోర్సు) Goverment సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర: జి.మురళి,అనంతపురం సెల్ :9030661651.

AJA- 246586

ADMISSIONS

American College of Paramedical courses Qualification: ఇంటర్ మీడియట్ రెండు సంవత్సరాలు పూర్తి అయిన వారికి మరియు open inter any group students(1). D.M.L.T (2).Anaesthesia (3).Cordiology (4). D.M.P.H.A. రెండు సంవత్సరాల కోర్సులకు అడ్మిషన్స్ జరుగుచున్నవి. Cont:9989953273,7013370612.

AJA-7174

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

7న పౌర్ణమి పూజలు

ధర్మవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న రమణ మహర్షి ఆశ్రమంలో ఈ నెల 7న ఆదివారం పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు చిప్పలవెంకప్ప బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. ఆశ్రమంలో ఉదయం 10గంటలకు ఆవునేతితో అరుణాచల మహా దీపాన్ని వెలిగిస్తామన్నారు. భక్తులచేత అక్షర మణిమాల పారాయణం ఉంటుందన్నారు. మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

గ్రామ దేవతలకు బోనాలు



గంగమ్మకు బోనాలు సమర్పిస్తున్న గ్రామస్థులు

అమడగూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరిపల్లి ఎస్సీకాలనీలో బుధవారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. ఆనవాయితీగా ప్రతియేటా గ్రామం చుట్టు ఉన్న గంగమ్మ, మారెమ్మ, కప్పలమ్మ, సత్యమ్మ, మద్యమ్మకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పిస్తామని కాలనీవాసులు తెలిపారు. ప్రజలు సుఖంగా ఉండాలని మొక్కులు చెల్లించారు.

ఉచిత బ్యాంకింగ్ శిక్షణ

ధర్మవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో డిగ్రీ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచనలతో సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత బ్యాంకింగ్ శిక్షణ ఏర్పాటు చేసినట్టు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. నంద్యాల లోని గురు రాఘవేంద్ర కోచింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్టు ఆ యన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న ప్రవేశపరీక్ష ఉంటుందని ఉత్తమ ప్రతిభ కనబరచిన 50 మందిని ఎంపిక చేసి ఉద్యోగం సాధించేవరకు ఉచిత భోజనం, వసతి, ప్రొఫెషనల్ శిక్షణ ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హరీశ్‌తో పాటు సంస్కృతి సేవాసమితి ప్రతినిధులు కోరారు. వివరాలకు 7998256789, 9490442576 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి: సీడీపీఓ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళలు రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ జయంతి పేర్కొన్నారు. ఐసీడీఎస్ పీడీ ప్రమీల ఆదేశాల మేకుఉ ప్రశాంతి గ్రామ్‌లోని సీడీపీఓ కార్యాలయంలో బుధవారం మహిళా చట్టాలపై అంగన్‌డీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. బేటీ బచావో- బేటీ పఢావో యాక్ట్, ఓఎస్‌సీ సర్వీస్ 28028, డీఎస్ యాక్ట్ 28023 గురించి వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ జయంతి, జిల్లా వైద్యఆరోగ్యశాఖా సిబ్బంది, డీహెచ్‌ఈఓ రామలక్ష్మమ్మ డీవీ సెల్ కౌన్సిలర్ ఉమాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

జింకను స్వాధీనం చేసుకున్న అధికారులు



జింకను స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

బత్తలపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ముస్తూరులో సాంబశివుడు అనే వ్యక్తి నుంచి బుధవారం జింకను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. మండల పరిధి లోని ముస్తూరుకు చెందిన సాంబశివుడు జింకను ఇంటి వద్ద పెంచుతున్నట్లు సమాచారం అందడంతో ఏఎస్ఐ వెంకటేశు ఫారెస్టు బీట్ అధికారి అక్కులప్పతో కలసి వారి ఇంటి వద్దకు వెళ్లారు. అతడిని విచారించగా కొద్ది రోజుల క్రితం వ్యవసాయ పొలంలో గాయపడి పడి ఉన్న జింకను తీసుకొచ్చి చికిత్స చేయిం చానని అతడు తెలిపాడు. దీంతో ఫారెస్టు అధికారులు జింతో పా టు సాంబశివుడిని పుట్టపర్తి ఫారెస్టు కార్యాలయనికి తీసుకొచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. జింకను స్వాధీనం చేసుకుని ఫారెస్టు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

వ్యక్తిపై హత్యాయత్నం కేసు

కదిరి అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ మహిళపై కత్తితో దాడిచేసిన వ్యక్తిపై హత్యాయత్నంకేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి బుధవారం తెలిపారు. పట్టణంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన జహీదాకు, వరుసకు చిన్నాన్న కుమారుడైన ముబారక్ మధ్య ఆస్తి విషయంలో గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ముబారక్ జహీదా ఇంటివద్దకు వెళ్లి కత్తితో దాడికి ప్రయత్నించగా, ఆమె ఇంటి తలుపులు వేసుకుంది. ఆమె ఇంటి ఎదురుగా ఉన్న హైమావతి వద్దకు వెళ్లి జహీదా తప్పించుకోవడానికి నీవే కారణమంటూ కత్తితో ఆమెపై దాడిచే శాడు. జహీదా, హైమావతి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముబారక్‌పై హత్యాయత్నం కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు.

మహిళపై దాడి.. తొమ్మిది మందిపై కేసు

ధర్మవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్‌లో ఓమహిళపై దాడి చేసిన సంఘటనలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. శాంతినగర్‌కు చెందిన దాసరిసులోచన, రామ్మోహన్ దంపతులు నివాసముం టున్నారు. రామ్మోహన్ బెంగళూరులో డ్రైవర్‌గా పనిచేస్తు వారానికి ఒకసారి వచ్చి వెళ్లే వాడు. సులోచన చీరల వ్యాపారం చేస్తోంది. వారు ఆర్నెల్ల నుంచి శాంతి నగర్‌లో బాడుగ ఇంట్లో ఉంటున్నారు. అయితే శాంతినగర్‌లోని ఓ వీధిలో వినాయక లడ్డూ వేలం విషయంలో అంజనేయులు, రాజు అనే ఇద్దరు స్థానికులు మంగళవారం గొడవ పడ్డారు. ఈ గొడవకు సులోచనే కారణమంటూ సుధ అనే మహిళతో పాటు మరో ఎనిమిది మంది ఆమె ఇంట్లోకి వెళ్లి దాడిచేసి గాయపరిచారు. చుట్టుపక్కల వారు సులోచనను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సులోచన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



భాస్కర్ (ఫైల్)

నల్లమాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొగ్గిటివారిపల్లిలో భాస్కర్(44) అనే వ్యక్తి బుధవారం ఓ వ్యక్తి విద్యుదాఘాతమై మృతిచెందాడు. మండ లంలోని బొగ్గిటివారిపల్లికి చెందిన భాస్కర్ పని నిమిత్తం సమీపంలోని ఇంటి నుంచి తన ఇంటి వద్దకు ఇనుప నిచ్చెన తీసుకొచ్చాడు. దానిని వెనుకభాగం నుంచి కిందికి దించుతున్న సమయంలో పైనున్న విద్యుత్ తీగలు నిచ్చెనకు తగిలాయి. దీంతో విద్యుదాఘాతమై భాస్కర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని అంబులెన్స్‌లో కదిరికి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు భాస్కర్ తండ్రి తిరుపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిరుపయోగంగా నీటి ట్యాంకులు

● పాతవి వదిలేసి, కొత్త ట్యాంక్‌ల నిర్మాణం
● రూ.లక్షల్లో ప్రజాధనం వృథా



గాండ్లపెంటలో నిరుపయోగంగా మారిన ట్యాంకు

గాండ్లపెంట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఉండకూడదని ప్రతి గ్రామంలో ప్రభుత్వం బోర్లు, పైపులైన్, మోటార్లు, తాగునీటి ట్యాంక్ తదితరాలను ఏర్పా టు చేస్తోంది. వీటి నిర్వాహణ కోసం పంచాయతీ అధికారులతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను నియమించింది. అయితే గతంలో నీటి ట్యాంక్‌లు, పైపులు, బోర్లకు చిన్నపాటి మరమ్మతులను అధికారులు పట్టించుకోకుండా అలాగే వదిలేస్తున్నారు. కొత్త వాటి కోసం ప్రతిపాదనలు పంపుతున్నారు. కొత్తవి ఏర్పాటు చేసి రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. దీంతో గతంలో నిర్మించిన ట్యాంక్‌లు నిరుపయో గంగా మారి ప్రజాధనం వృథా అవుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

తాగునీటి కోసం రూ.లక్షలు ఖర్చు

మండల వ్యాప్తంగా 14 పంచాయతీల్లో వంద గ్రామాలున్నాయి. దాదాపు 30మంది కిపైగా జనాభా ఉన్నట్లు జనాభా ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రతి గ్రామంలో జనాభాకు అనుగుణంగా తాగునీటి బోర్లు వేస్తున్నారు. ఈ మేరకు మండలంలో 129 బోరుబావులున్నాయి. అలాగే పలు గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, భూమికి సమాంతరంగా నిర్మించిన 31 ట్యాంక్‌లు ఉన్నాయి. అయితే అవి చిన్నపాటి మరమ్మత్తులకు గురికావడంతో వాటికి నీరు నింపడం లేదు. దీంతో గాండ్లపెంట, కటారుపల్లి తదితర గ్రామాల్లో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన ట్యాంక్‌లు నిరుపయోగంగా మారుతున్నాయి.



గాండ్లపెంటలో బోరు పక్కనే బోరు వేసిన దృశ్యం

నూతన ట్యాంక్‌ల కోసం ప్రతిపాదనలు

మండలంలో జలజీవన్ పథకం కింద గాండ్లపెంట, తూపల్లి, వేపరాల, సీఎంతండా, గాజువారిపల్లి పెద్దతండా, కమతంపల్లి, బనాన్‌చెరువుపల్లి, కురమామిడిలో నూతన ట్యాంక్‌లు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. 20వేల లీటర్ల సామర్థ్యంతో ఆరు, 40వేల లీటర్ల సామర్థ్యంతో మూడు చొప్పున మొత్తం తొమ్మిది ట్యాంకుల కోసం ప్రతిపాదనలు వెళ్లాయి. 20 వేల లీటర్ల ట్యాంక్ నిర్మాణానికి రూ.19లక్షలు, 40వేల లీటర్ల ట్యాంక్ నిర్మాణానికి రూ.33లక్షల నుంచి రూ. 37లక్షల వరకు అంచనా వేశారు. టెండర్ల ద్వారా నిర్మాణానికి ప్రభుత్వం అనుమతువ్వడంతో పనులు జరుగుతున్నాయి.

గాండ్లపెంటలో ఇలా...

గాండ్లపెంటలో పంచాయతీ, సత్యసాయి ట్యాంక్‌లతో పాటు భూమికి సమాతరంగా నిర్మించిన మరో రెండు ట్యాంక్‌లు ఉన్నాయి. మొత్తం 1.50 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ఈ నాలుగు ట్యాంక్‌లను ఐదేళ్ల నుంచి ఉపయోగించకపోడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. గతంలో చెత్త సంపద కేంద్రం వద్ద తాగునీటికోసం బోరు వేయించి, దాని నుంచి గాండ్లపెంట ప్రజలకు నీరు అందించేవారు. అయితే ప్రస్తుతం అదే బోరు పక్కన మరో బోరు వేసి, ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మిస్తుండడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఇలా నిధులు దుర్వినియోగం చేయడం ప్రజలపై భారాలు మోపడమేనని ప్రజలు అంటున్నారు. పాత వాటికి చిన్న చిన్న మరమ్మతులు చేసి వినియోగంలోకి తేస్తే, ప్రజలకు అన్నివేళ్లల నీరు అందుబాటులో ఉంటుందని గాండ్లపెంట, కటారుపల్లి తదితర గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ట్యాంక్‌లను వినియోగంలోకి తెస్తాం

గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న వివిధ రకాల ట్యాంక్‌లకు చిన్నపాటి మరమ్మతులు చేయిస్తాం. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో చర్చించి, వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషిచేస్తాం.

\- కిరణ్‌కుమార్‌రెడ్డి, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్

షాదీ మహల్ నిర్మించండి

● పరిటాల శ్రీరామ్‌కు ముస్లింల వినతి



ఈద్గా మైదానాన్ని పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మైనార్టీల కోసం షాదీమహల్ నిర్మించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌కు ముస్లిం నాయకులు విజ్ఞప్తిచేశారు. వారు బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పరిటాల శ్రీరామ్‌ను కలిశారు. వారి విజ్ఞప్తి మేరకు ఆయన పోతుకుంట వద్ద ఈద్గా మైదానాన్ని పరిశీలించారు. త్వరలో ఎంపీ బీకే పార్థసారథిని కలిసి ఎంపీ ఫండ్స్ ద్వారా షాదీ మహల్ నిర్మించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం మైనార్టీల పక్షాన ఉంటుందని స్పష్టం చేశారు. మరో వైపు పట్టణంలని బాలికల ఉన్నతపాఠశాల పాఠశాలలో సమస్యలను పరిటాలశ్రీరామ్ దృష్టికి తీసుకురాగా ఆయన నేరుగా పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. ముఖ్యంగా అక్కడ నిర్మించిన సభావేదిక రావిచెట్టు ఊడలుదిగి కూలేందుకు సిద్ధంగా ఉందని ఉపాధ్యాయులు ఆయన దృష్టికితెచ్చారు. అలాగే రెండు గదులు మరమ్మతులకు వచ్చాయని, వంట చేసేందుకు సౌకర్యాలు లేవని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నూతన గదుల నిర్మాణానికి కృషిచేస్తానని ఆయన అన్నారు. అలాగే పాఠశాలలో 617 మంది విద్యార్థులు ఉన్నారని, ఇటీవల చాలా మంది విద్యార్థినుల హాజరు శాతం తగ్గుతోందని హెచ్‌ఎంతెలిపారు. హాజరుశాతం తగ్గడానికి కారణాలు తెలుసుకోవాలని పరిటాలశ్రీరామ్ సూచించారు. అవసరమైతే త్వరలో ఎమ్మెల్యే పరిటాల సునీతను పాఠశాలకు ఆహ్వానించి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, మదీన మసీదు ముతవల్లి నాగూర్‌హుస్సేన్, ముస్లిం మైనార్టీ నాయకులు రాళ్లపల్లి షరీఫ్, అత్తర్ రహీంబాషా, అస్లాం, పఠాన్ బాబుఖాన్, షామీర్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

పూలే విగ్రహానికి స్థలం కేటాయించండి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకుడు ఎంఎస్ షబ్బీర్ బుధవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అలాగే జిల్లా కేంద్రాన్ని మార్చకూడదని కోరారు. నాయకులు క్రిష్ణమూర్తి, రసూల్‌సాబ్, దాదాపీర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఎమ్మెల్యేని బర్తరఫ్ చేయాలి

● సీపీఎం నాయకుల డిమాండ్ ● ఆర్డీఓకు వినతి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుల పక్షాన పోరాటం చేస్తున్న సీపీఎం నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా నాయకులు ఈఎస్ వెంకటేసు, లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ సువర్ణకు వినతి పత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే జయరాం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ళ అంజి, కొత్తచెరువు మండల కార్యదర్శి అంకే ముత్యాలు, పైపల్లి గంగాదర్ తదితరులు పాల్గొన్నారు.

● ధర్మవరం: సీపీఎం రైతుసంఘం నాయకులను అవమానించే విధంగా మాట్లాడిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్‌చేశారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో నిరసన చేపట్టారు. అనంతరం పోలా రామాంజినేయులు రెండో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీచేనేత కార్మిక సంఘం జిల్లానాయకులు ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, హైదర్‌వలి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి, వెంకటస్వామి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

సొసైటీలు రైతులకు వెన్నెముకలాంటివి

● ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొత్తచెరువు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):ప్రాథమిక సహకార సొసైటీలు రైతులకు వెన్నెముకలాంటివని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కేశాపురం ప్రాథమిక సహకార సొసైటీ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. అదే వైసీపీ హయాంలో దాడులు, కూల్చివేతలు తప్ప అభివృద్ధి మచ్చుకైన కనిపించలేదని విమర్శించారు. సహకార వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. సహకార సంఘాల ద్వారా విరివిగా రుణాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కేశాపురం సహకార సంఘం అధ్యక్షుడిగా జనసేన పార్టీకి చెందిన బాబయ్యను ఎంపిక చేశామన్నారు. సత్యనారాయణ అనే రైతు సహకార సొసైటీ కింద బీమా చేయించాడు. ఆయన మృతిచెందడంతో మంజూరైన రూ. 2లక్షల బీమా చెక్కులను ఆయన భార్య ప్రతిభాకు సహకార సొసైటీ అధ్యక్షుడు బాబయ్య, రాష్ట్ర సాగునీటి సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్‌లతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో పుటపర్తి మార్కెట్‌యార్డ్ చైర్మన్ పూలశివ, టీడీపీ మండల, పట్టణ కన్వీనర్లు రామకృష్ణ, ఒలిపి శీన, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కొత్తచెరువు, తలమర్ల, బుక్కపట్నం సింగిల్‌విం డో అధ్యక్షులు హరిప్రసాద్, గోపాల్‌రెడ్డి, చెన్నక్రిష్ణ, నాయకులు లక్ష్మీనారాయణ, శంకరప్ప, ముమ్మనేని వెంకటరాముడు, సాగునీటిసంఘం అధ్యక్షుడు సంజీవరాయుడు, అశ్వత్థప్ప, నవీన్‌కుమార్, బీజేపీ నాయకులు ధర్మతేజ, జనసేన నాయకులు గూడా సోము, అల్లాడి జయరాం, కెంపుల జనార్దన్, డాన్ సూరి పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ బీకే జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరులో ఎంపీ బీకే పార్థసారథి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, కూటమి నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేయించారు. అనంతరం గ్రామసమీపంలో ఉన్న అనాథాశ్రమంలో వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేశారు. వృద్ధులకు పండ్లు, భోజనం అందించారు. మాజీ సర్పంచ్ శివయ్య, అనిల్‌గౌడ్, కట్టుబడి వెంకటేష్, మీసాల అంజి, రామకృష్ణ, నారాయణ స్వామి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

తనకల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఓ హోటల్‌లో పీడీఎస్ బియ్యం ఉన్నాయని రెవెన్యూ అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో సీఎస్‌డీసీ వెంకటరెడ్డి బుధవారం హోటల్ వద్దకు వెళ్లి మూటల్లో ఉన్న బియ్యాన్ని పరిశీలించి, 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 169 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి నివేదికలు ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. మండలంలోని పలు చౌకధాన్యపు డిపోలు, లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి, తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటివారిపై దాడులు చేసి కేసులు నమోదు చేయనున్నట్లు సీఎస్‌డీటీ తెలిపారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో జరుగుతున్న అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారక క్రికెట్ టోర్నీ సీజన్-2 మ్యాచ్‌లో హోరాహోరీగా సాగుతున్నాయి. బుధవారం మొదటి మ్యాచ్‌లో ఫ్రెండ్స్ లెవన్స్ జట్టుపై గణేష్ ఫ్రెండ్స్ జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రెండోమ్యాచ్‌లో నాయక్ వారియర్స్ జట్టుపై లక్ష్మీ నరసింహ లెవెన్స్ జట్టు విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో బసంపల్లి జట్టుపై కొండకమర్ల సూపర్‌కిం గ్స్ జట్టు 7 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. రోజంతా ఉత్కంఠభరితం గా సాగిన పోటీల్లో క్రీడాకారులు బౌలింగ్, బ్యాటింగ్‌లో తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ మ్యాచుల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు అవార్డులను అందజేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతులను గె లుచుకున్న షేక్‌హుస్సేన్, దివాకర్, ప్రసా ద్‌ను బీజేపీ నాయకులు, సీనియర్ ఆటగాళ్లు, కోచ్‌లు షీల్డులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు, కోచ్‌లు పృథ్వీ, రాజేశేఖర్, బీజేపీ నాయకులు అంగజాల రాజు, భాస్కర్, సీనియర్ ప్లేయర్‌లు విశ్వనాథ్, దంపెట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



క్రీడాకారులకు షీల్డ్‌లు అందజేస్తున్న నాయకులు

ప్రజలకు మెరుగైన సేవలందించండి

●రెవెన్యూ అధికారులు, సర్వేయర్లకు ఆర్డీఓ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేశ్

ధర్మవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలందించేలా దృష్టి సారించాలని ఆర్డీఓ మహేశ్ అధికారులకు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయన బుధవారం రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ...ప్రస్తుత కాలంలో ఎదురవుతున్న అత్యవసర సమస్యలు, ప్రాధాన్యమైన పనులు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. ఇటీవల పొలాల రస్తా, పొలాల సరిహద్దు వివాదాలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని సకాలంలో పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే రెవెన్యూ, సర్వే అధికారులు, వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లు అత్యంతకీలక పాత్ర పోషించాలని ఆర్డీఓ పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

ధర్మవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న అన్నక్యాంటీన్‌ను బుధవారం ఆర్డీఓ మహేశ్ ఆకస్మింగా తనిఖీచేశారు. భోజనం నాణ్యత, రుచి, పరిమాణం గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, పరిశుభ్రత, హైజిన్ తదితర అంశాలను తనిఖీ చేశారు. వంటశాలలో శుభ్రత, పదార్థాల నాణ్యత, లబ్ధిదారుల రిజిస్టర్ నిర్వహణను పరిశీలించారు. నాణ్యతలో రాజీ లేకుండా సకాలంలో భోజనం అందించాలని ఆర్డీఓ సిబ్బందిని ఆదేశించారు.

నెరవేరుతున్న సర్పంచ్‌ల కల

● ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

తాడిమర్రి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సర్పంచ్‌ల కల నెరవేరేలా కూట మి ప్రభుత్వం 15వ ఆర్థికసంఘం నిధులు రూ.1121 కోట్లను సర్పంచ్‌ల ఖాతాల్లోకి విడు దల చేసిందని ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపారన్నారు. ఆయన విజ్ఞప్తి మేరకు 15వ ఆర్థికసంఘం నిధులను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా విడుదల చేశారన్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు కృషి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శేఖర్

ధర్మవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి గ్రామం అభివృద్ధి కోసం తగిన సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో బుధవారం పార్టీ పట్టణ, రూరల్ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జీఎం శేఖర్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పట్టణ, రూరల్ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమా లు విస్తృతస్థాయిలో జరుగుతున్నాయని అన్నారు. పలు ప్రధాన ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తి అయ్యాయని అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గంలో రూ. కోట్ల అంచనాతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, భూమిపూజ చేశారన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, జిల్లా ప్రధానకార్యదర్శి సాకే ఓబుళేశు, పట్టణ, రూరల్ అధ్యక్షులు జింకా చంద్ర, గొట్లూరు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈ - క్రాప్ నమోదు చేసుకోండి : ఏడీఏ

బత్తలపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారులు బుధవారం మండలపరిధిలోని ఎం.చెర్లోపల్లిలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి, రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏడీఏ లక్ష్మనాయక్ మాట్లాడుతూ... సాగు చేసిన పంటకు తెగుళ్లు సోకితే వ్యవసాయ అధికారులను సంప్రదించి, వారి సూచన మేరకు మందులు వాడాలని సూచించారు. రైతులు సాగు చేసిన పంటలకు తప్పక ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఓబిరెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గ్రామ సచివాలయంలో బుధవారం నాబార్డు సహకారంతో ఏడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ చలం పలు విషయాలపై వివరించారు. సొసైటీ అధ్యక్షుడు బోయపల్లి శివారెడ్డి, తుమ్మల మహబూబ్‌బాషా, ఫీల్డు అధికారి బ్రహ్మచారితోపాటు, బ్యాంక్ ఖాతాదారులు, వెలుగు సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గాండ్లపెంట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమతంపల్లి వద్ద ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇస్మాయిల్ అనే వ్యక్తి గాయపడాడు. ఎన్పీకుంట మండలంలోని గౌనకపేటకు చెందిన ఇస్మాయిల్ మంగళవారం రాత్రి స్వగ్రామం నుంచి కదిరికి తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నాడు. కమతంపల్లి సమీపంలో వెనుక నుంచి గాండ్లపెంట పోలీసులకు చెందిన ద్విచక్రవానం ఢీకొంది. తనకు కాలు విరిగి తీవ్ర రక్తగాయాలుకాగా, తన భార్యకు స్వల్పగాయాలైనట్లు ఇస్మా యిల్ బుధవారం తెలిపాడు. తమను 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, అక్కడ చికిత్స పొందుతున్నట్లు తెలిపాడు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరాంజనేయులు, జిల్లా నాయకుడు ఆర్‌ఎంపీ హరిక్రిష్ణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ తల్లిని రాహుల్‌గాంధీ దూషించడం సరికాదన్నారు. బీజేపీ నాయకులు సున్నంపల్లి రంగారెడ్డి, రమణయ్య, క్రిష్టప్ప, నాగప్ప, రాజశేఖర్, వెంకటలక్ష్మి, వెంకటేష్, లావణ్య కొండప్ప, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం



రైతులతో చర్చిస్తున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

మడకశిర రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులకు న్యాయం జరిగేవరకు దశలవారిగా భూపోరాటం చేయనున్నట్లు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని సి.కోడిగేపల్లిలో రైతులతో కలసి భూ సమస్యలపై చర్చించారు. 20 ఏళ్ల క్రితం పరిశ్రమలు నెలకొల్పుతామని మడకశిర మండలంలో సి.కోడిగేపల్లి, నల్లనాయనపల్లి, కేతేపల్లి, పరిగి మండలంలోని కొన్ని గ్రామాలోని రైతుల నుంచి దాదాపు 2,200 ఎకరాల భూములను చౌకగా రైతుల నుంచి తీసుకున్నారని తెలిపారు. ఇంటికి ఒకఉద్యోగం ఇస్తామన్నారని, నేటికీ ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. సేకరించిన భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, ప్రధాన కార్యదర్శి పెద్దన్న, నాయకులు సోమ్‌కుమార్, రామకృష్ణ, సీఆర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి మంత్రి నివాళి



కార్యకర్త మృతికి నివాళులర్పిస్తున్న మంత్రి సవిత

రొద్దం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనిమేకలపల్లికి చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త కురుబ కిష్టప్ప(55) అనారోగ్యంతో మృతి చెందడంతో రాష్ట్ర మంత్రి సవిత నివాళులర్పించారు. బుధవారం రొద్దం మండల పరిధిలోని గౌనిమేకలపల్లిలో టీడీపీ కార్యకర్తకు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధులు నరసింహులు, పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ వేర్వేరుగా కార్యకర్తకు నివాళులర్పించారు. మంత్రి వెంట టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, నరహరి, రామచంద్ర, అశ్వర్థనారాయణ, హరీష్, టైలర్ ఆంజనేయులు, నరసింహులు, అశ్వర్థప్ప, ఇమాంసాబ్ పాల్గొన్నారు. రొద్దంలో నూతన టీడీపీ కార్యాలయానికి మంత్రి తొలిసారిగా వచ్చారు. నెలరోజుల క్రితం టీడీపీ కార్యాలయాన్ని రొద్దం, ఆర్. మరువపల్లి మధ్యలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మంత్రికి టీడీపీ నాయకులు స్వాగతం పలికారు.

'ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి'

రొళ్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం తల్లిదండ్రులు, గ్రామ ప్రజల బాధ్యత అని ఏఐసీసీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి తెలిపారు. మండలంలోని బీజీహళ్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు వసంతప్ప సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసంతప్ప సేవలను కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉంటాయని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, తల్లిదండ్రుల తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు శ్రీధర్, ఎంఈఓలు శ్రీధర్, సుధాకర్, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యెంజేరప్ప, హెచ్‌ఎంలు హరిక్రిష్ణ, హరినాథ్‌రెడ్డి, వేణుగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ

రొద్దం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రొద్దం సింగిల్‌విండో అధ్యక్షుడిగా వీరాంజనేయులు కార్యాలంలో బాధ్యతలు స్వీకరించారు. బుధవారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో పూజలు నిర్వహించారు. డైరెక్టర్లుగా నారాయణస్వామి, ఓబులేసు బాధ్యతలు చేపట్టారు. టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, నరహరి, టైలర్ ఆంజనేయులు, నరసింహులు, అధ్యక్షులకు పూలమాలలువేసి శాలువకప్పి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పవన్, హరీష్, చంద్రశేఖర్, కిష్టప్ప, చిన్నకేశవులు, చిరంజీవి పాల్గొన్నారు.

6న రంగస్థల నాటక సమాజ స్థాపన

పెనుకొండ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తండ్రి, దివంగత మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డి జయంతి సందర్భంగా ఈనెల 6న రంగస్థల నాటక సమాజస్థాపన ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్లు ఘనగిరి లలిత కళాపరిషత్ సభ్యులు కోగిర జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని కోరుతూ మంత్రి సవితకు ఆహ్వానపత్రికలు అందజేశారు. కళాకారులకు జయచంద్రారెడ్డితో పాటు రంగస్థల కళాకారుడు హార్మోనిస్ట్ రవికుమార్ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9866877634, 9440822071కు సంప్రదించాలన్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

గోరంట్ల , సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ పదవిని గోరంట్ల మండలానికి కేటాయించడంతో స్థానిక టీడీపీ నాయకులు బుధవారం మంత్రి సవితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర హస్తకలల డైరెక్టర్‌గా నియమితులైన పులేరు సోముశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు పెనుకొండకు వెళ్లి మంత్రిని కలిశారు. మంత్రిని శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాలక్రిష్ణచౌదరి, నిమ్మల విద్యాధరణీ, నిమ్మల శ్రీధర్, నాగేనాయక్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు బ్రేకులు ఫెయిల్..

త్రుటిలో తప్పిన ప్రమాదం

మడకశిర టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చంద్రమౌళేశ్వరస్వామి దేవాలయం సమీపంలో బుధవారం కర్ణాటక ఆర్టీసీ బస్సుకు బ్రేకులు ఫెయిలయ్యాయి. డ్రైవర్ చాకచక్యంగా బస్సును పొలాల్లోకి దింపడంతో పెను ప్రమాదం తప్పింది. కర్ణాటక బస్సులు అత్యంత వేగంగా నడుపుతుంటారు. బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. రోడ్డు దిగువకు ఉండడంతో బస్సు వేగంగా వెళుతుండగా బ్రేకులు ఫెయిలయ్యాయి. బస్సును పొలాల్లోకి దించడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

డీజేతో యమ డేంజర్..!

● ఎక్కువ శబ్దాలతో పెనుముప్పు
● హెచ్చరికలతోనే సరిపెడుతున్న యంత్రాంగం



డీజే వద్ద నృత్యం చేస్తున్న యువత

హిందూపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం హిందూపురం పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా అధిక సౌండ్ వచ్చే డీజే శబ్దానికి ఓ యువకుడి గుండె ఆగింది. ఏడాది క్రితం హిందూపురం పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా అధిక సౌండ్ ఉన్న డీజేలు వినియోగించారు. ఈ శబ్దానికి రెండు పశువులు మృతిచెందాయి. గత యేడాది డీజే సౌండ్ ఎక్కువగా ఉండడంతో ఓ వృద్ధుడికి గుండెపోటు వచ్చింది. వెంటనే ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల వేడుక అయినా, శుభకార్యమైనా డీజేలు, టపాసులు తప్పనిసరి అయ్యాయి. మితిమీరిన శబ్దాలను వెలువరిస్తున్న డీజేలు ప్రాణాలు తీసేస్తున్నాయి. శబ్దాల హోరుకు వృద్ధులు, చిన్నారులేకాక యువత కూడా బలవుతున్నారు. శబ్ద కాలుష్యం గర్భిణీలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గర్భాధారణ నుంచి 60 రోజుల లోపు పిండం పై డీజే సౌండ్ అధికంగా పడుతుంది. వీటిని అరికట్టాల్సిన అధికార యంత్రాంగం, సంబంధిత శాఖలు హెచ్చరికలకే పరిమితమవుతున్నాయి.

మితిమీరిన శబ్దాలతో ముప్పే

వినాయక నిమజ్జనం సందర్భంగా డీజేల వినియోగం అధికమవుతోంది. ఒకప్పుడు సిటీలకే పరిమితమైన డీజేలు పట్టణం, పల్లెకు కూడా పాకాయి. వినాయక విగ్రహం పెట్టారంటే తప్పకుండా డీజే ఉండాల్సిందే.

డీజే శబ్ద తీవ్రతను కొలవడానికి డెసిబుల్ (డీబీ)అనే ప్రమాణాన్ని ఉపయోగిస్తారు. నివాస ప్రాంతాల్లో 55 డీబీ, రాత్రిపూట 45 డీబీ శబ్దాన్ని వినియోగించవచ్చు. వ్యాపార సముదాయాల్లో పగటిపూట 65 డీబీ, రాత్రి పూట 55, పరిశ్రమలున్న ప్రాంతాల్లో పగటి పూట 75, రాత్రిపూట 65, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలున్న ప్రాంతాల్లో పగలు 50, రాత్రిపూట 40డీబీలు మాత్రమే వాడుకోవాలి. ప్రస్తుతం డీజేలకు 80 నుంచి 100 డీబీల దాకా వాడుతున్నారు. దీనివల్ల ప్రాణాలకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

వేడుక ఏదైనా డీజే ఉండాల్సిందే..

ఇటీవల పుట్టిన రోజు వేడుకలు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు, దేవుడి కార్యక్రమాలకు డీజేల వాడకం అధికమయింది. రూ.30వేలు మొదలుకుని రూ.5 లక్షలు చెల్లిస్తూ డీజేలు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం డీజే ట్రెండ్ కొనసాగుతోంది. ఒకప్పుడు మేళతాళాలతో కార్యక్రమాలు నిర్వహించేవారు. తరువాత బ్యాండ్‌సెట్‌తో నిర్వహించేవారు. ఆ తరువాత చిన్నపాటి సౌండ్ స్పీకర్లు ఏర్పాటు చేసుకునేవారు. ప్రస్తుతం డీజే లేనిదే కార్యక్రమం లేదనే స్థాయిలో వినియోగిస్తున్నారు. హిందూ పురంలో గురువారం జరిగే వినాయక నిమజ్జన వేడుకలకు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ నుంచి సుమారు 80కి పైగా డీజే వాహనాలు బుక్ చేసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని డీజే వాహనాలు హిందూపురానికి చేరుకున్నాయి.

పరిమితి దాటితే ప్రమాదమే



సాధారణంగా ఆరోగ్యంగా ఉన్నవారు 50 డీబీ లోపు సౌండ్ వినవచ్చు. 80డీబీ దాటితే ఇబ్బందే. ఇక 100, 120 డీబీల సౌండ్ ఉంటే గుండె జబ్బున్న వారికి తీవ్ర ప్రభావం చూపుతుంది. 120 దాటితే చిరాకు, చర్మంపై రోమాలు నిక్కపొడుచుకోవడం, విపరీతమైన తలబాధ వస్తుంది. 150 దాటితే చెవుల్లో వినికిడి కణాలపై ప్రభావం పడుతుంది. దీనివల్ల పాక్షికంగా వైకల్యం కూడా కలగవచ్చు. ఇక 180డీబీ దాటితే కర్ణభేరి పగిలిపోయే ప్రమాదం ఉంది. శక్తికోల్పోయి వినికిడి సమస్య తలెత్తే అవకాశం ఉంటుంది. అంతేకాక రక్తపోటు, బ్రెయిన్ స్ట్రోక్‌కూడా వచ్చే అవకాశం ఉంది. అనారోగ్యంతో ఉన్నవారు డీజే సౌండ్‌కు దూరంగా ఉండటం మంచిది.

\- వెంకటరమణనాయక్, వైద్యుడు

కేసు నమోదు చేస్తాం



ఎలాంటి వేడుకల్లో అయినా డీజేలకు అనుమతిలేదు. నిబంధనలు ఉల్లంఘించి అధిక శబ్దం ఉన్న డీజేలు వాడితే వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేస్తాం. ఎవరికైనా ఏదైనా ప్రమాదం సంభవిస్తే సంబధిత నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

\- మహేష్, డీఎస్పీ

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

సోమందేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తికుంటపల్లి ఎస్సీ కాలనీలో గత ఐదేళ్ల నుంచి విద్యుత్ సమస్య వేధిస్తోందని, అధికారులు పరిష్కరించాలని బుధవారం కాలనీ ప్రజలు కోరారు. టీడీపీ నాయకులు తిప్పన్న మాట్లాడుతూ.. కాలనీ పరిసరాల్లో ఉన్న విద్యుత్ స్తంభాల సర్వీస్ వైర్లలో చెట్ల కొమ్మలు చొరబడటంతో తరచూ ట్రిప్ అవుతూ ట్రాన్స్‌ఫార్మర్‌లో బ్రేక్‌డౌన్ అవుతోందన్నారు. వారానికోసారి ఈ సమస్య ఉత్పన్నం కావడంతో కాలనీలో వీధిదీపాలు, గృహాలకు విద్యుత్ సరపరా ఆగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఎప్పుడేమి జరుగుతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటు సంచరిస్తున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.



చెట్ల కొమ్మల మధ్య సర్వీస్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లో సరఫరా పునరుద్ధరణకు పాట్లు

గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలి

మడకశిర రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ తెలిపారు. స్వాతంత్ర సమరయోధుడు శ్రీరామరెడ్డి 120 జయంతి వేడుకలను పురస్కరించుకొని బుధవారం నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రాంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలగించి క్రీడలను ప్రారంభించారు. పావగడ ఎమ్మెల్యే బోలింగ్ చేయగా, మాజీ మంత్రి రఘువీరారెడ్డి బ్యాటింగ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, నాయకులు మంజునాథ్, ప్రభాకర్‌రెడ్డి కేటీ శ్రీధర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్

ఘనంగా బీకే జన్మదిన వేడుకలు



ఆర్. మరువపల్లిలో ఎంపీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రొద్దం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి జన్మదిన వేడుకలను రొద్దం మండల టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం ఆర్.మరువపల్లిలోగల బీకే నంజయ్య రైస్‌మిల్లులో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నాయకులు నారప్ప, తురకలాపట్నం నాగేంద్ర, ఇమాంసాబ్, అశ్వర్థప్ప, లీలావతి, తులసి, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెనుకొండ : హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి జన్మదిన వేడుకలను బుధవారం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. ఉదయం పార్థసారధి అల్లుడు శశిభూషణ్ పటేల్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్‌చేశారు. అనంతరం నాయకులు రవిశంకర్, గోనిపేట వెంకటేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.

● సోమందేపల్లి : మండల కేంద్రంలోని భగీరథ కల్యాణమండపంలో హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి జన్మదిన వేడుకలను ఉప్పర సగర కులస్థులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నా యకులు రొద్దం నరసింహులు, సుబ్బరత్నమ్మ, భాను, అశ్వర్థ, నాగమణి గాయిత్రి, గోపాల్, లక్ష్మణ్ణ, కుమార్, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

హిందూపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పరిగి బస్టాండు వద్ద ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నూతన సీసీరోడ్డు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ సురేంద్ర మాట్లాడుతూ.. ఏళ్లతరబడి రోడ్డు గుంతలుగా ఉండి ఇబ్బంది పడుతుండేవారని తెలిపారు. దీన్ని గమనించిన ఎమ్మెల్యే బాలకృష్ణ సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేయగా మున్సిపల్ నిధులతో రూ.26.50లక్షలు వెచ్చించి రోడ్డు నిర్మాణం పూర్తిచేశామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున, నాయకులు వెంకటేశ్, బేవనహళ్లి ఆనంద్‌కుమార్, పరిమళ, సతీష్‌కుమార్, రాఘవేంద్ర, ఇర్షాద్, డైమండ్ బాబా, శీన, ప్రవీణ్, పవన్, రామాంజి పాల్గొన్నారు.

7న ఉపాధ్యాయులకు పురస్కారాలు

పెనుకొండ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ సహకారంతో ఉమ్మడి జిల్లాకు చెందిన 66 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ పురస్కారాలకు ఇవ్వనున్నట్లు ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి సుధాకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ఈనెల 7న ధర్మవరం పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్‌లో ప్రదానం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, రవీంద్రనాథ్, నబీ, ఉపేంద్రమూర్తి, గంగాధర్, నరసింహులు, రాజగోపాల్, రామాంజనేయులు, నరేష్, గోవిందప్ప, ప్రభాకర్, మహేష్‌గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు

రొళ్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని టిడిపల్లి గ్రామానికి చెందిన రంగదామప్ప(65) బుధవారం ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మేకల మేత కోయడానికి కొండ దగ్గర గల పొలానికి వెళ్లాడు. పొదలో దాగి ఉన్న ఎలుగుబంటి వ్యక్తిపై దాడిచేసింది. గమనించిన స్థానికులు ఆ వ్యక్తిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సను అందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

చిరుత దాడిలో దూడ మృతి

గుడిబండ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగతుర్పి గ్రామానికి చెందిన వీరకేతరాయప్ప దూడ చిరుత దాడిలో మృతిచెందినట్లు తెలిపారు. మల్బరీ షెడ్డు వద్ద ఆవు దూడను కట్టి వేసిన సమయంలో మంగళవారం రాత్రి చిరుత దూడపై దాడిచేయడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ప్రాంతంలో చిరుతలు అధికంగా ఉండడం తో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్ఎస్ శెట్టిపల్లిలో చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ త్రూ ఎడ్యుకేషన్, ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉచిత కుట్టు, కంప్యూటర్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక శెట్టిపల్లిలో ఉచిత కుట్టు, కంప్యూటర్ శిక్షణా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని నిరుద్యోగ యువతీ యువకులు, మహిళలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి కుళ్లాయిస్వామి, వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీ, ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుకన్య, కుట్టుశిక్షణ మాస్టర్ లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తి బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలి

లేపాక్షి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలని ఆర్బీఐ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ మహానా పేర్కొన్నారు. బుధవారం చోళసముద్రం గ్రామంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. ప్రతి వ్యక్తి బ్యాంక్ ఖాతా కలిగి ఉండటంవల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు సులువుగా వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు. బ్యాంక్ ఖాతాలో ఉన్న సదరు వ్యక్తికి పీఎంఎస్‌బీవై ప్రీమియం రూ.20కే రూ.2లక్షల ప్రమాద బీమా లభిస్తుందన్నారు. పీఎంజేజేబీవై వార్షిక ప్రీమియం రూ.436కే రూ.2లక్షల జీవిత బీమా లభిస్తుందన్నారు. 18ఏళ్ల నుంచి 70ఏళ్ల వరకు బ్యాంక్ ఖాతాదారులకు మాత్రమే పీఎంఎస్‌బీవై పథకం వర్తిస్తుందన్నారు. 18-50వయసున్నవారికి పీఎంజేజేబీవై వర్తిస్తుందన్నారు. గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంక్ వివరాలు తెలపవద్దన్నారు. కార్యక్రమంలో రమణకుమార్, ఎల్‌డీఎం రమేష్ ఆర్ఎం, విజయ్‌బాబు, లేపాక్షి బ్రాంచ్ మేనేజర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్బీఐ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు: చైర్మన్



గుడ్డం కోనేరువద్ద పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్ తదితరులు

హిందూపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం సందర్భంగా గుడ్డం కోనేరువద్ద పట్టణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ సురేంద్ర పేర్కొన్నారు. బుధవారం గుడ్డం కోనేరువద్ద ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూపురం నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగుతుందని, దీనిని తిలకించడానికి భారీగా భక్తులు హాజరవుతారని, ఆ మేరకు ఏర్పాట్లు చేశామన్నారు. విద్యుత్ దీపాలు, క్రేన్‌లు సిద్ధం చేశామన్నారు. మున్సిపల్ సిబ్బంది వారం రోజులుగా కష్టపడుతున్నారన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎంఈ దస్తగిరి, డీఈఈ వాణి, జనార్దన్, శానిటరీ సిబ్బంది, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎరువుల కొరతపై రైతుల ఆగ్రహం



అధికారులతో రైతుల వాగ్వాదం

సోమందేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కావలసిన మేరకు ఎరువులు లేకపోవడంతో బుధవారం సింగిల్‌విండో కార్యాలయం వద్ద రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి కార్యాలయం వద్ద క్యూలో ఉన్న రైతులకు డీఏపీ ఎరువులు అయిపోయాయని తెలపడంతో ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. 140 బస్తాలు మాత్రమే స్టాక్ ఉండటంతో టోకన్లు ఇచ్చిన వారికి మాత్రమే ఎరువులు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. జూలై మాసం నుంచి మూడు లోడ్ల యూరియా వచ్చిందన్నారు. వచ్చిన స్టాక్‌ను మండలంలోని రైతులకు యథావిధిగా అందిస్తామన్నారు. ఈ విషయమై ఏఓ విజయ భారతిని వివరణ కోరగా.. ఎరువుల కొరత లేదన్నారు. ప్రస్తుతం మండలంలోని తొమ్మిది ఆర్బీకేల్లో పందిపర్తి, తుంగోడు, గుడిపల్లి, కేతగానిచెరువులో డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎంపీ అంబికా

హిందూపురం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు బుధవారం రాత్రి విగ్రహాలవద్ద జరిగిన పూజల్లో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ సర్కిల్, బాపూజీనగర్‌లో ఏర్పాటు చేసిన ఆదిజాంబవతి, వల్లభ, యోయోబాయ్స్ విగ్రహాల వద్ద ఆయన పాల్గొన్నారు.



వినాయకుడి వద్ద అంబికా

ఘనంగా ఓనం వేడుకలు

హిందూపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో బుధవారం ఓనం పండగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాంచజన్య పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. దేశంలో అనేక సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లయిన కేరళ రాష్ట్ర ప్రజలు జరుపుకునే తొలి పండగ ఓనం అని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గాయిత్రి, ఏఓ భాస్కర్, శశికళ, సతీష్‌కుమార్, రజాక్ పాల్గొన్నారు.



ఓనం పండగ జరుపుకుంటున్న ఉపాధ్యాయులు

చలో విజయవాడను విజయవంతం చేయండి

మడకశిర టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 6న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ముదాహిర్, మహీంద్రా, గణేష్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ఎస్ తాలూకా కన్వీనర్‌గా మధు ఎంపిక

పావగడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక దళిత సంఘర్ష సమితి (డీఎస్ఎస్) పావగడ తాలూకా కన్వీనర్‌గా దవడబెట్ట గ్రామానికి చెందిన మధు ఎంపికయ్యారు. బుధవారం శివమొగ్గలో జరిగిన కార్యవర్గ సమావేశం లో పావగడ నుంచి మధును ఎంపిక చేసినట్లు రాష్ట్ర కన్వీనర్ గురుమూర్తి ప్రకటించారు. ఈ సందర్భంగా డీజేఎస్ నారాయణప్ప, హనుమంతరాయ, రాష్ట్ర నరసింహ, నాగరాజు, ముత్యాలప్ప, అంజప్ప, విజయ్‌కుమార్, మారప్ప హాజరయ్యారు.



మధును అభినందిస్తున్న నాయకులు

ప్రతి పంచాయతీకి డిజిటల్ గ్రంథాలయం అవసరం

పావగడ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించుటకు ప్రతి గ్రామ పంచాయతీలోనూ డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలనిని రొప్పం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయ తెలిపారు. బుధవారం ఆ గ్రామ పంచాయతీలో ఉన్న డిజిటల్ గ్రంథాలయంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు త్రివేణి, అంబికా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రావుడి ఆంజనేయస్వామి కలశ స్థాపన

అగళి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావుడి ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం కలశస్థాపన, ధ్వజస్తంభ స్థాపన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమంతనాథ స్వామి హాజరయ్యారు. ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. ధ్వజస్థంభన కార్యక్రమం, గోపుర, కళశ స్థాపన కార్యక్రమాలను హనుమంతస్వామిచే నిర్వహించారు. మహిళలు, భక్తులు హారవతులు మోస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి, జ్యోతులు మోస్తున్న మహిళలు